విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

ఆదివారం 20 అక్టోబరు 2024 8 పేజీలు

రేపు 'ఉక్కు దీక్ష-బహిరంగ సభ'

హాజరుకానున్న రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు... నిర్వహణ కమిటీ ఛైర్మన్ అమృతరాజ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విశాఖ ఉక్కు సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన సత్యాగ్రహి, మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృతరావు 103 వ జయంతి సందర్భంగా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు గుంటూరు అమరావతి రోడ్డులోని అమృతరావు సెంటర్(సర్కిల్) వద్ద 'ఉక్కు దీక్ష-బహిరంగ సభ' నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ ఛైర్మన్ టి.అమృతరాజ్ తెలిపారు. స్థానిక అరండల్ పేటలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఉక్కు దీక్ష-బహిరంగ సభకు ముఖ్యఅతిధిగా మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం 1966వ సంవత్సరంలో -మిగతా 2 లో ...

కోర్టులో ఉద్యోగాల పేరుతో

రూ.1.10 కోట్లకు టోకరా

న్యాయం కోసం బాధిత మహిళల ఆవేదన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎన్టీఆర్ జిల్లా కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేసి 11మంది నుండి ఒక కోటి పది లక్షల రూపాయలు వసూలు చేసిన ముగ్గురు మోసగాళ్ల నుండి తిరిగి తమ డబ్బులను ఇప్పించాలని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం 40వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు పి.వి .చిన్న సుబ్బయ్య కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాధితులు జె .విజయ కుమారి, జె. రామలక్ష్మి, ఎల్. నిర్మలాదేవి, జె. వెంకటరమణ తదితరులు మాట్లాడుతూ తమను ఏ విధంగా ఉద్యోగాల పేరుతో -మిగతా 2 లో ...

వరద బాధితులకు ..

వైద్య సేవలు

ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : వరద ప్రభావిత ప్రాంతాల్లో వరద బాదితులకు ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నట్లు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యులు, సెక్రటరీ ఎం.బబిత తెలిపారు. విజయవాడ అర్బన్ పరిదిలోని న్యూ వాంబే కాలనీ యూపీహెచ్‌సీలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ శనివారం అరోగ్య శాఖ సహాయంతో ఏర్పాటు చేసిన వైద్య శిభిరాన్ని న్యాయమూర్తులు బబిత, ఎ.సత్యానంద్ ప్రారంభించారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార స ంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ దీరజ్‌సింగ్ ఠాకూర్, ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మార్గనిర్ధేశంతో వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేసినట్లు -మిగతా 2 లో ...

జాతీయ స్థాయి

మానిటరింగ్ కమిటీ పర్యటన

పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

విశాలాంధ్ర-నరసరావుపేట : పల్నాడు జిల్లాలో శనివారం నుంచి 23వ తేది వరకు జాతీయ స్థాయి మానిటరింగి కమిటి పర్యటనకు సంబందిత అధికారులు అందుబాటులో ఉండి తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సంబందిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో కేంద్ర పథకాల అమలుపై జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటి ఫేజ్-1, 2024-2025కు సంబందించి పర్యటనపై ఆయా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఎంజీఎన్ఆర్ఈజీఎస్, సోషల్ అసిస్టెన్స్, హౌసింగ్, -మిగతా 2 లో ...

వరద బాధితులకు

అన్యాయం

గవర్నర్‌కి వైసీపీ నేతల వినతి

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడలో వరద బాధితులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని, బాధితులకు జరిగిన అన్యాయాన్ని వైసీపీ నేతలు శనివారం గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. రాజ్‌భవన్‌లో వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, పశ్చిమ నియోజకవర్గ ఇంఛార్జి, వెలంపల్లి శ్రీనివాసరావు,సెంట్రల్ నియోజకవర్గ ఇంఛార్జి మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా,మేయర్ రాయన భాగ్యలక్ష్మి,డిప్యూటీ మేయర్లు శైలజారెడ్డి, బెల్లందుర్గ, పీఏసీ కమిటీ సభ్యుడు అసిఫ్, వైసీపీ నేత పూనూరు గౌతమ్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయం అందలేదని రోడ్డెక్కిన మహిళల పై లాఠీ ఛార్జి చేశారని, 500 కోట్లు విరాళాలొచ్చినా సాయం -మిగతా 2 లో ...

సీపీఐ నేత వేముల అచ్చిరెడ్డి సేవలు చిరస్మరణీయం-6

ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలి

వివరాలు 2 లో ...

ఇళ్ల మధ్య మద్యం షాపును తొలగించాలి-3

గుంటూరులో భారీవర్షం

-లోతట్టు ప్రాంతాలు జలమయం

-స్తంభించిన ట్రాఫిక్

-భయాందోళనకు గురైన ప్రజలు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు పట్టణంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంట సేపు కురిసిన భారీ వర్షంతో నగరంలలోని ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రభుత్వ మహిళా కళాశాల, నగర పాలక సంస్థ కార్యాలయం, మార్కెట్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో కార్లు, -మిగతా 2 లో ...

మధ్యాహ్న భోజనం జడ్జి తనిఖీ

విశాలాంధ్ర-కూచిపూడి : మెనూప్రకారం పంపిణీ చేస్తున్నారా? ఎలా ఉన్నాయో పదార్థాలు ఏ విధంగా ఉన్నాయంటూ కృష్ణాజిల్లా న్యాయస్థానం సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య పిల్లల్ని అడిగి -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

రేపు 'ఉక్కు దీక్ష-బహిరంగ సభ'

అమృతరావు 26 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశారని గుర్తుచేశారు. ఆయన నిరాహార దీక్ష ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడిందన్నారు. ప్రదర్శనలు, ర్యాలీలు, బంద్‌లు, రాస్తారోకోలు జరిగాయని, 32 మంది ఉద్యమకారులు పోలీసు కాల్పులలో బలిదానం గావించబడ్డారని తెలిపారు. 65 మంది శాసనసభ్యులు, అనేక మంది పార్లమెంట్ సభ్యులు ఉక్కు ఫ్యాక్టరీ విశాఖలోనే స్థాపించాలని డిమాండ్ చేస్తూ రాజీనామాలు చేశారని వివరించారు. ఆమరణ నిరాహార దీక్ష ద్వారా తెలుగు ప్రజల ఆకాంక్షను అమృతరావు బలంగా ప్రతిబింబించారన్నారు. ఫలితంగా నాటి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఉక్కు ఫ్యాక్టరీని విశాఖ పట్టణంలోనే నిర్మించేందుకు నిర్ణయించిందని, దీనితో తెలుగు ప్రజల కల సార్థకమైందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటులో అమృతరావు పాత్ర గణనీయమైనదని అన్నారు. అనేక త్యాగాలతో నిర్మితమైన ఈ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నేటి కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించే చేసే దిశగా అడుగులు వేస్తుందని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా గత 4 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలు, ఉక్కు కార్మికులు పోరాటాలు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అమృతరావు 103వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన స్ఫూర్తితో ఒక్క రోజు దీక్ష చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ దీక్షకు గుంటూరు నగరంలోని ప్రజలు పెద్దసంఖ్యలో భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, న్యాయవాది గణపు వందనం బాబు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో ఉద్యోగాల పేరుతో రూ.1.10 కోట్లకు టోకరా

మోసం చేశారో వివరించారు. విజయవాడ విద్యాధరపురం నకు చెందిన న్యాయవాది టి. వెంకటరమణ, అతని సహాయకుడు కిషోర్, వైయస్సార్ కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు షేక్ అహ్మద్ అనే వ్యక్తి కలసి తమ వద్ద నుంచి ఒక కోటి పది లక్షల రూపాయలను వసూలు చేశారని బాధితులు చెప్పారు. మీకు కోర్టులో సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు వస్తున్నాయని చెబుతూ నకిలీ పత్రాలను చూపించే వారని చెప్పారు. గత మూడు సంవత్సరాల క్రితం తాము మోసగాళ్ల మాటలు నమ్మి వారికి డబ్బులు చెల్లించినట్లు చెప్పారు. తాము మోసపోయామన్న విషయాన్ని గ్రహించి తమ డబ్బుల కోసం తాము గట్టిగా ప్రశ్నిస్తే మీ అంతు చూస్తామని హెచ్చరికలు చేశారని అన్నారు. అలాగే మరికొంతమంది నుంచి మీకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తాము, తక్కువ రేటుకి భూములు ఇప్పిస్తాము, చేపల చెరువులు ఇప్పిస్తాము అని మాయమాటలు చెప్పి లక్షల రూపాయలు వసూలు చేశారని వాపోయారు. ఇప్పుడు ప్రభుత్వం మారిపోయింది తామేమి చేయలేము అని చెబుతూ డబ్బులు తిరిగి ఇచ్చేది లేదంటున్నారని వాపోయారు. తమ డబ్బులు విషయమై పలుమార్లు అడిగినా తమను బెదిరిస్తూ మాట్లాడటంతో తాము భయపడి తాము ఈ విషయమై స్థానిక తెలుగుదేశం నాయకుల సహకారంతో భవానీపురం పోలీస్ స్టేషన్ లో శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తమకు న్యాయం చేయాలని వారు కోరారు. తెలుగుదేశం 40 డివిజన్ అధ్యక్షులు చిన్న సుబ్బయ్య, 38 వ డివిజన్ అధ్యక్షురాలు పితాని పద్మ, టిడిపి నాయకులు సురభి బాలు మాట్లాడుతూ బాధితులు తమ వద్దకు రావడంతో తాము జరిగిన విషయాన్ని ఆరా తీశామని చెప్పారు. ఈ విషయాన్ని తమ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని చెప్పారు. బాధితులు ప్రస్తుతం భవానీపురంలో నివసిస్తున్నందున ఈ విషయాన్ని భవానీపురం పోలీస్ స్టేషన్ లో తెలియజేయడం జరిగిందన్నారు.

జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటీ పర్యటన

స్వమిత్వ వంటి అనేక పథకాలపై క్షేత్రస్థాయిలో అమలు తీరును పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వడం జరుగుతుందన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో గుర్తించిన అంశాలపై సానుకూల దృక్పథంతో ముందుకు వెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో పంచాయతీ సెక్రటరీలు, ఆయా సిబ్బందికి సెలవులు మంజూరు చేయవద్దని అధికారులకు సూచించారు. జాతీయ స్థాయి టీము కారెంపూడి, మాచెర్ల, మాచవరం, క్రోసూరు మండలాలలో పర్యతటిస్తుందన్నారు. కమిటి పర్యటనపై ఆయా మండల ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. కేంద్ర పథకాల అమలులో సమ్మిళితమైన శాఖలు వారివారి శాఖలపై సమగ్ర నివేదికలు సంబంధిత నమూనాలో అందచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయి మానిటరింగ్ కమిటి టీము లీడర్ లోహిత్ రెడ్డి, రాం రెడ్డి, జిల్లా అధికారులు డ్వామా పీడీ బాలూ నాయక్, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, జిల్లా పంచాయతి అధికారి భాస్కరరెడ్డి, జిల్లా సర్వే అధికారి మధుకీర్తి, డీఎల్‌డీఓ గబ్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం జడ్జీ తనిఖీ

ఆరాతీశారు. మొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమంలో శనివారం పాల్గొని విద్యార్థులకు భోజనాన్ని పరిశీలించారు. మొవ్వలో జరిగిన నూతన తరహా న్యాయ సేవల శిబిరంలో పాల్గొనటానికి విచ్చేసిన ఆయన కొద్దిసేపు హైస్కూల్లో పిల్లల మధ్య గడిపారు. తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెరాసుల్తానా, ఎంఈఓ-2 కే శ్రీలక్ష్మి, హెచ్ఎం ఎస్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అన్యాయం

అందించలేదని తెలిపారు. వరదల పై సమాచారం ఇవ్వలేదని, వరదల్లో సాయం చేయలేదని, వరదలు తగ్గాక కూడా న్యాయం జరగలేదని వరద బాధితులకు సాయం అందకపోవడంపై గవర్నర్ ఆశ్చర్యపోయారు. ఎన్యుమరేషన్ అంతా తప్పుల తడక. బాధితుల వివరాలను సక్రమంగా నమోదు చేయలేదన్నారు. ఎన్యుమరేషన్‌లో సగం మంది బాధితులను వదిలేశారు. కలెక్టరేట్ లో బాధితులు వినతిపత్రం ఇస్తే కనీసం పరిశీలన చేయలేదని చెప్పారు. ఓట్లు వేయించుకునే వరకూ ఒకలా...ఓట్లు వేశాక మరోలా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఎన్యుమరేషన్ సమగ్రంగా చేపట్టాలని కోరారు. విరాళాల సొమ్ము 500 కోట్లు..కేంద్రం ఇచ్చిన 1000 కోట్లు పూర్తిగా బాధితులకు అందించాలన్నారు. బాధితులకు న్యాయం జరిగేవరకూ పోరాటం కొనసాగిస్తామని, వినతిపత్రాలు ఇస్తూనే ఉంటామని తెలిపారు. గవర్నర్ స్పందిస్తూ బాధితులందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

గుంటూరులో భారీ వర్షం

ఆటోలు, ద్విచక్ర వాహనాలు సగం మేర నీటిలో మునిగిపోయాయి. గాంధీ పార్క్ వద్ద భారీగా వర్షపు నీరు నిల్వ ఉండడంతో చెరువును తలపించింది. రోడ్లపై వర్షపు నీరు భారీగా నిలవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నెహ్రు నగర్ మూడు వంతెన రోడ్డు పూర్తిగా జలమయమై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల ముంపుకు గురైన విజయవాడ, చెన్నై నగరాలతో సమానంగా గుంటూరులో రోడ్లన్నీ జలమయం కావడంతో ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. వర్షం వెలిశాక ఒక్కసారి వేల సంఖ్యలో వాహనదారులు రోడ్ల పైకి రావడంతో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. బస్సులు, కార్లు, ఆటోలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గుంటూరు నగరంలో అమృత్ పథకం కింద రూ.500 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులను గత ప్రభుత్వం నిలిపివేసింది. కార్పొరేషన్ అధికారులు పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను కనీసం మరమ్మత్తులు చేపట్టడంలో విఫలమయ్యారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసిన పట్టణంలో జనసంద్రంగా ఉండే ముఖ్యమైన కూడలి ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ఏర్పడుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, వర్షం నీటి నుండి ప్రజలను కాపాడాల్సి ఉంది.

వరద బాధితులకు ప్రత్యేక వైద్య సేవలు

తెలిపారు. జిల్లా వైద్యశాఖ అధికారులు, పోలీస్ శాఖ సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరం ద్వారా వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు కార్డియాలజిస్టుతో పాటు గైనకాలజిస్టు, చిన్న పిల్లల వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు, ఫిజీషియన్ తదితర వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రూ.3లక్షలలోపు వార్షిక ఆదాయం కలిగినవారు, మహిళలు, పిల్లలు, ఎస్టీ, ఎస్సీలు, వరద వంటి విపత్తు ప్రభావిత ప్రజలకు న్యాయ సలహా, సహాయం కోసం ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకు జిల్లా, రాష్ట్ర న్యాయసేవాదికార సంస్థలను సంప్రదించాలని, 15100 హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్‌లో కూడా సంప్రదించవచ్చని తెలిపారు. డీఎంహెచ్‌వో డా.సుహాసిని మాట్లాడుతూ వాంబే కాలనీ వంటి వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల ఆరోగ్య అవసరాలు తీర్చేందుకు 63 రకాల వైద్య పరీక్షలు నిర్వహించటం జరుతుందన్నారు. ఈసీజీ, ఏకో పరీక్షల నిర్వాహణకు కూడా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాదికార సంస్థ డిప్యూటీ సెక్రటరీ డా.అమర రంగేశ్వరరావు, సీఐ వెంకటేశ్వర్లు, డీపీఎంవో డా.నవీన్, డీపీవో మహేష్, అధికారులు పాల్గొన్నారు.

21న పరిటాలలో గ్రామసభ

విశాలాంధ్ర-కంచికచర్ల : రీ సర్వేలో తప్పులు ఉంటే రైతులు అర్జీలు సమర్పించాలి. తహసిల్దార్ జాహ్నవి ఈనెల 21వ తేదీన మండల పరిధిలోని పరిటాల గ్రామపంచాయ తీ కార్యాలయం నందు గ్రామసభ నిర్వహించటం జరుగుతుందని స్థానిక తహసిల్దార్ పి జాహ్నవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ గతంలో పరిటాల లో జరిగిన రిసర్వేలో రైతులు యొక్క భూమి విస్తరణలో ఏమైనా తేడాలు ఉన్న సరిహద్దు తేడాలు ఉన్న 21వ తారీకు జరగబోయే గ్రామ సభలో రైతులు తమ తమ సమస్యలపై అర్జీలు సమర్పించిన యెడల వెంటనే రైతులు ఇచ్చిన అర్జీలపై సదరు రిసర్వే కి సంబంధించిన సర్వేయర్ల తో సమస్యలు పరిష్కరించబడ తాయని తాసిల్దార్ తెలిపారు. గతంలో జరిగిన రిసర్వేలో ఎటు వంటి ఔక తవకలు ఉన్న ఎటువంటి ఇబ్బందులు ఉన్న ప్రతి ఒక్క రైతు ఈ ఒక్క గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తాసిల్దార్ కోరారు.ఈ గ్రామ సభకు మండల సర్వేలు సంబంధిత అధికారులు పాల్గొంటారు.

ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడ నగర పాలక సంస్థలో ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 36 వ డివిజన్ ఊర్వశి సెంటర్ శానిటరీ కార్యాలయం వద్ద శనివారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. 24వ తేదీ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించనున్న విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నైజాం గేట్ సెంటర్ శానిటరీ కార్యాలయం జరిగిన సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు బుద్దె రాజా మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనాభాకి అనుగుణంగా అదనపు సిబ్బందిని నియమించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, మున్సిపల్ ఎంప్లాయిస్ నాయకులు జెక్కి జేమ్స్, తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలకు విశేష స్పందన

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కూచిపూడి లోని రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం ఆరవ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్యాలయంలో పలు విభాగాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 353 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆ వైద్యులకు వైద్యాలయం ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్, అసిస్టెంట్ ఏవో ఎన్.ఎస్. ప్రకాష్, సలహా మండలి కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వరరావు, సభ్యులు అన్నేకుమార్, యార్లగడ్డ సుభాష్ చంద్రబోస్, పామర్తి శివకుమార్, కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షులు కోనేరు మంజునాథ్, మాజీ అధ్యక్షులు బి. హెచ్. రామ శేష సాయి,, సిబ్బంది సహకరించారు.

పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-వీరులపాడు: పల్లెల అభివృద్ధే లక్ష్యంగా 'పల్లె పండుగ' ను కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు.. 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా వీరులపాడు మండలంలోని పెద్దాపురం, జయంతి, చౌటపల్లి గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆమె శనివారం పాల్గొన్నారు. సుమారు ఒక కోటి పది లక్షల అంచనా వ్యయం తో పలు సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దాపురం గ్రామానికి 60 లక్షలు, జయంతి గ్రామానికి 30 లక్షలు, చౌటపల్లి గ్రామానికి 20 లక్షల చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచుకున్న నమ్మకాన్ని ఒమ్ము చెయ్యకుండా పల్లెల పై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రతి పల్లె లో కొత్త వెలుగులు తెస్తామని ఆమె అన్నారు. అనంతరం చౌటపల్లి గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్, వైకాపా నేత పల్లెప్రోగు పుల్లయ్య ఎమ్మెల్యే సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. ఈ కార్యక్రమాలలో మండల తెదేపా అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస కుమార్, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు చీదిరాల భరత్ రెడ్డి, దాములూరు మధు,గురిజాల అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధివిక్రయదారులకు ఆర్థిక సాయం చేయాలి

జి. కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): బుడమేరు ముంపు వలన నష్టపోయిన వీధి విక్రయదారులకు ఆర్థిక సాయం చేయాలని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీధివిక్రయదారుల కార్మిక ఫెడరేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వన్‌టౌన్ లెనిన్‌భవన్‌లో వరదల్లో నష్టపోయిన చిరువాపారులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో 32 డివిజన్లు జలదిగ్బంధంలో ఉన్న విషయం అందరికీ తెలిసినదే. ఈ ప్రాంతాలలో చిరు వ్యాపారాలు చేస్తున్న వీధివిక్రయదారులకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని, వారి తోపుడు బండ్లు, కూరగాయలు పండ్లు, పువ్వులు, ఇతర పచ్చి సరుకులు పాడైపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, పనులు లేక మరింత ఆర్థిక ఇబ్బందులకు లోనయ్యారని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వీరికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నేడు విజయవాడ నగరంలో బుడమేరు ముంపులో కూరుకుపోయి నష్టపోయిన చిరు వ్యాపారులను కూడా ఆదుకుంటామని సీఎం చంద్రబాబునాయుడు ఇప్పటికే ప్రకటించారు. వారు ఇచ్చిన మాట మేరకు తక్షణమే వీధివిక్రయదారులకు ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే నగరంలో సుమారు 5 వేల మంది వీధి విక్రయదారులు నగరపాలక సంస్థకు అర్జీలు పెట్టుకున్నారని, వారికి వెంటనే ఎన్యుమరేషన్ చేసి ఆర్థిక సహాయం అందించవలసిందిగా నగరపాలక సంస్థ కమిషనర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు , హాకర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు కొట్టు రమణారావు, కోశాధికారి కొరికాని నీలం నాయుడు, ఏఐటీయూసీ నాయకులు తాడి పైడయ్య ,సి హెచ్. ఎల్ .వి .పి. మారుతిరావు, మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, వీధివిక్రయదారుల కార్మిక ఫెడరేషన్ నాయకులు ఎక్కిలి కృష్ణ, మల్లేశ్వరిలు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం షాపును తొలగించాలి

అడ్డాడ ప్రసాద్

విశాలాంధ్ర-చల్లపల్లి : జనావాసల మధ్యలో మద్యం షాపును తొలగించాలని సీపీఐ కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక 3వ వార్డులో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని స్థానికులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మద్యం షాపును తొలగించాలని తహశీల్దార్ వనజాక్షికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రసాద్ బాబు మాట్లాడుతూ గుడి,బడి వంటి ప్రాంతాలకు దూరంగా ఏర్పాటు చేయాలని మద్యం షాపులను బడికి దగ్గరగా, గృహాల మధ్య ఏర్పాటు చేయడం సరికాదన్నారు. మద్యం షాపునకు కూత వేటు దూరంలో బాలికల వసతి గృహం, ఉర్దూ పాఠశాల ఉన్నాయని వీటికి దగ్గరగా మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే అనేక ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. ఇదే ప్రాంతంలో రైతు బజారు, సంత మార్కెట్ ఉన్నందున అనేక మంది మహిళలు ప్రతీ రోజు ఇక్కడకు వస్తుంటారని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులలో ఇక్కడ మద్యం దుకాణం నిర్వహించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఒక పక్క స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రజలకు ఇబ్బంది కలిగే ప్రదేశాలలో మద్యం షాపులు ఏర్పాటు చేయవద్దని ప్రకటనలు చేస్తుంటే ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో షాపు ఏర్పాటుచేయడం సరికాదన్నారు. ప్రజలనుండి వ్యతిరేకత వస్తున్నా... ఎక్సైజ్ శాఖ అధికారులు నిమ్మకు నీరేత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యద్దనపూడి మధు,మహమ్మద్ కరీముల్లా వెనిగళ్ళ వసంతరావు, జనసేన నాయకుడు తాతారావు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి అవసరం : ఎమ్మెల్యే యార్లగడ్డ

విశాలాంధ్ర-గన్నవరం : పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శనివారం గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం లోని తేలప్రోలులో రూ.40 లక్షల తో 600 మీటర్ల సీసీ రోడ్డు కు, బాపులపాడు మండలం వేలేరు గ్రామంలో రూ.72 లక్షలతో మూడు సిసి రోడ్లకు, మడిచర్లలో రూ.80 లక్షలతో రెండు సిసి రోడ్లకు, బిలనపల్లిలో రూ.13 లక్షలతో 220 మీటర్ల సిసి రోడ్డుకు, కొత్తపల్లిలో రూ.26 లక్షలతో రెండు సిసి రోడ్లకు, మల్లవల్లిలో రూ.34.5 లక్షలతో రెండు సిసి రోడ్లకు, రామన్నగూడెంలో రూ.26 లక్షలతో రెండు సిసి రోడ్లకు, రేమల్లెలో రూ.44 లక్షలతో రెండు సిసి రోడ్లకు, ఎస్ఎన్ పురం లో రూ.4 లక్షలతో ఒక సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే యార్లగడ్డ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, నియోజకవర్గ పరిశీలకులు వడ్లాని హరిబాబు, నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, పుట్ట సురేష్ , వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు

రేపు చేతి వృత్తిదారుల జిల్లా విస్తృత సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా చేతి వృత్తిదారుల విస్తృత సమావేశం ఈ నెల 21వ తేది సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా చేతి వృత్తిదారుల కన్వీనర్ బుద్ధారపు వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఉదయం 11 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా చేతి వృత్తిదారుల జిల్లా మొదటి మహాసభ మైలవరంలో నవంబర్ ఒకటో తేదీన జరిగే విధంగా సన్నాహ ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చిస్తారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె రామాంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక లయన్స్ సేవ భవనంలో శనివారం ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం ఏర్పాటు చేయబడినదని గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. ఈ నేత్ర వైద్య శిబిరంలో కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సేవ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ సభ్యులు కొల్లి రాజేష్ ఆర్థిక వితరణతో, గుడివాడ లయన్స్ క్లబ్ నేత్ర వైద్యశాల వారి సహకారంతో నిర్వహించామని శశికళ తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కారం : ఎమ్మెల్యే వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో కూటమి ప్రభుత్వం పరిష్కరించిందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండలంలోని పోలిమెట్ల, శేరి కల్వపూడి, అంగులూరు, చంద్రాల, విన్నకోట గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో కూటమి పార్టీల నేతలు, ప్రజలతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం ఉదయం పాల్గొన్నారు. పల్లె పండుగలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే రాముకు, కూటమి నేతలకు గ్రామ గ్రామాన ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా రూ.1.21 కోట్లతో కుచ్చికాయలపూడి గ్రామంలో బీటి రోడ్డు నిర్మాణానికి, పోలిమెట్ల గ్రామంలో రూ.19.12లక్షలు, శేరి కల్వపూడిలో రూ. 26లక్షలు, అంగలూరులో రూ.23 లక్షలు, చంద్రాలలో రూ.26 లక్షలు, విన్నకోటలో రూ. 34 లక్షలు మొత్తం రూ.2.69 కోట్ల నిధులతో ఆయా గ్రామాల్లో చేయనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాము భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడ్లవల్లేరు తహసీల్దార్ లోకరాజు, ఎండిఓ సారథి, ఇఇపీఆర్ నాగేశ్వరరావు, డిఇపిఆర్ బి.రవి, టిడిపి నాయకులు చేకూరు జగన్ మోహన్ రావు, వల్లభనేని వెంకట్రావు, అడుసుమిల్లి చిట్టిబాబు, వి. శివప్రసాద్, బొప్పన శివప్రసాద్, పొట్లూరి రవి, తాతారావు, కొడాలి రామరాజు, చాపరాల బాలాజీ, పోలవరపు వెంకట్రావు, చాపరాల రాజా, సురగాని ప్రసాద్, సుబ్రమణ్యం, ఈడే మోహన్, కాగిత నరేంద్ర, గోవాడ శివ, తోట చిన్నా, వెంకటరత్నం, కొప్పినేని పిచ్చేశ్వరరావు, బుర్ర నాగేశ్వరరావు, కంచర్ల ప్రకాష్ పాల్గొన్నారు.

డ్రోన్ సమ్మిట్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం : కమిషనర్ ధ్యాన్యచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ఈ నెల 22న పునమిఘాట్, బబ్బూరి గ్రౌండ్స్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న డ్రోన్ సమ్మిట్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నగరంలో జరగబోవు డ్రోన్ షో ఏర్పాట్లను కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానది తీరంలో డ్రోన్ షో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరగాలని వైద్యశాఖాధికారులను, ఘాట్లు వద్ద ఉన్న రైలింగ్‌లను సరి చూసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు, మొక్కలు నాటే అవకాశం ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటి హరితాన్ని పెంచాలని హార్టికల్చర్ విభాగాన్ని ఆదేశించారు. ఈ పర్యటనలో సీపీ ప్రసాద్, సీఈ శ్రీనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సీఎంఓహెచ్ డాక్టర్ సురేష్‌బాబు, ఎస్ఈ సత్యనారాయణ, అమృత్ పథకం జెడీ, యూసీడీ పీఓ డా.లత, ఈఈ ఏఎస్ఎన్.ప్రసాద్, ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామంతో వ్యాధులు దరిచేరవు : వెంకయ్య నాయుడు

విశాలాంధ్ర-గన్నవరం : రోజు వ్యాయామం మంచి ఆహారపు అలవాటులతోనే వ్యాధులు దరి చేరవని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు శనివారం ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలో స్వర్ణ భారతిలో ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ స్టార్‌రమేష్ ఆస్పత్రి వైద్య బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చ అధ్యక్షులు చిగురుపాటి కుమార స్వామి రమేష్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి గ్రామసభలు

విశాలాంధ్ర-వీరులపాడు: అక్టోబర్ 21 నుండి నవంబర్ 21 తేదీ వరకు పంచాయితీలలో గ్రామ సభ నిర్వహిస్తారని తహశీల్దార్ షేక్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, గతంలో మండలంలో జరిగిన రీ-సర్వేలో రైతులు భూమి విస్తరణలో ఏమైనా తేడాలు ఉన్న సరిహద్దు తేడాలు ఉన్న యెడల అక్టోబర్ 21వ తేదీ నుండి జరగబోవు గ్రామ సభలలో రైతులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించిన యెడల వెంటనే రైతులు ఇచ్చిన అర్జీలపై సదరు రీ సర్వే కి సంబంధించిన సర్వేయర్లతో సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. గతంలో జరిగిన రీ సర్వేలో ఎటువంటి అవకతవకలు ఉన్న ప్రతి ఒక్క రైతు గ్రామసభను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

22న పెడనలో జాబ్ మేళా

విశాలాంధ్ర-పెడన: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏపీఎస్ ఎస్ డి సి జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్‌డిఎ - సీడాప్ ఎస్.బి.ఎన్. ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెడన సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహించనున్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, భవానీపురం, ఎ.పి. హౌసింగ్ బోర్డు కాలని, ఫేజ్-II, ఫ్లాట్ నెం.29, బ్లాక్ నెం.1, కాపురస్తులు శ్రీ మిరియాల శ్యామసుందర్ పిళ్లై, తండ్రి: యం.యస్. పిళ్లై గారికి సంబంధించిన బ్లాక్ నెం.1, ఫ్లాట్ నెం.29, భవానీపురంకు చెందిన R.S.D దస్తావేజు నెం.8489/2017 తేది:3-8-2017, హౌసింగ్ బోర్డు నుండి SBI, సత్యనారాయణపురం కు పోస్టు ద్వారా పంపిన దస్తావేజులు పోయినవి. కావున సదరు దస్తావేజులు ఎవ్వరికైన దొరికిన యెడల ఈ క్రింది వారికి తెలియపేయు ప్రార్థన.

ఆథరైజ్డ్ ఆఫీసర్
భారతీయ స్టేట్ బ్యాంక్, సత్యనారాయణపురం బ్రాంచి

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

కృష్ణా జిల్లా జడ్జి అరుణ సారిక

విశాలాంధ్ర-కూచిపూడి : నేటి సమాజంలో యువత మద్యం, మాదక ద్రవ్యాల బారిన పడి తమ జీవితాలు పాడు చేసుకుంటున్నారని, సమాజంలో ఇలాంటి రుగ్మతలు పోవాలంటే తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జిఅరుణ సారిక అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడాలని, వారి అలవాట్లు తెలుసుకొంటూ వారిప్రవర్తన గమనిస్తూ వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృష్ణాజిల్లా మరియు కృష్ణాజిల్లా పరిపాలన యంత్రాంగం సంయుక్తంగా నల్సా (మాదకద్రవ్య బాధితులకు న్యాయ సేవలు మరియు మాదకద్రవ్యాల ముప్పు నిర్మూలన పథకం 2015, నల్సా (వయోవృద్ధులకు న్యాయ సేవలు పథకం 2016 అంశాలపై నిర్వహించిన "నూతన తరహా న్యాయ సేవల శిబిరం" శనివారం మొవ్వమండవ జానకి రామయ్య సులోచన క్షేత్రయ్య కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా జడ్జి అరుణ సారిక, మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, డి ఎల్ ఎస్ ఏ కార్యదర్శి కె.వి రామకృష్ణయ్య, మొవ్వ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ పి. రాజన్ ఉదయ్ ప్రకాష్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. అనంతరం జిల్లా జడ్జిఅరుణాసారిక మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు తెలియజేసి, వాటి బారిన పడకుండా యువతను కాపాడటం ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుష్పరిణామాల గురించి వివరించారు. జులై 1 నుండి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలలో మహిళల పరిరక్షణ అంశాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. డిఎల్ఎస్ఏ కార్యదర్శి కె.వి. రామ కృష్ణయ్య జిల్లాలో ఇప్పటివరకు 6 నూతన తరహా న్యాయ సేవలు శిబిరాలు నిర్వహించి వివిధ ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారులకు రూ.232 కోట్ల విలువైన ఉపకరణాలు పంపిణీ, లబ్ధి చేకూర్చినట్లు, సత్వర న్యాయం కోసం నిర్వహించిన లోక్ అదాలత్తుల ద్వారా 1,00,442 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. మొవ్వ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి.రాజన్ ఉదయ్ ప్రకాష్ వయోవృద్ధులకు న్యాయ సేవలు వివరించారు. దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు వివరించారు. అదనపు డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎ వెంకట్రావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫణి దూర్జటి, చెన్నుపాటి కీర్తి(వాసవ్య మహిళా మండలి), జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మౌనిక తదితరులు బాల్య వివాహాలు- వాటి పర్యవసానం, వయోవృద్ధుల సమస్యలు వారి సంక్షేమం గురించి మాదకద్రవ్యాల దుష్పరిణామాల గురించి ఈ సమావేశంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీఓ షారోన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవో జెవిమాదేవి,తాసిల్దారు కె. మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ : ఎమ్మెల్యే కాగిత

విశాలాంధ్ర-పెడన: వైసీపీ పాలనలో కుంటుపడిన గ్రామీణ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పెడన మండలం చోడవరం గ్రామంలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన " పల్లె పండుగ" కార్యక్రమంలో భాగంగా 5 లక్షల ఎంజీఎన్ఆర్ఇజీఎస్ నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి సంబంధించిన శిలా పలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించి రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఉమ్మడి రాష్ట్రంలో సీసీ రోడ్లను పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రభుత్వమని ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త పంచకర్ల సురేష్, పెడన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శలపాటి వీరప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్, పెడన ఎంపీటీసీ అర్జ వెంకట్ నగేష్ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

విత్తన దుకాణాల తనిఖీ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయ దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, అధీకృత డీలర్ల నుంచి దిగుమతి చేసుకున్న ఉత్పత్తులను మాత్రమే విక్రయించాల్సి ఉందని, ఎమ్మార్పీ ధరలకు మించి ఉత్పత్తులు విక్రయించినవారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లోని బిల్లు పుస్తకాలు, సరకుల వివరాలను పరిశీలించటంతోపాటు, కొన్ని ఉత్పత్తుల నమూనాలను సేకరించి, పరీక్షలకు పంపుతున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ఏ కొండూరు : ఎన్డీయే ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి యే ప్రధాన ధ్యేయం గా పనిచేస్తుందని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలం లోని రేపూడి గోళ్ళమండల తండా కంభంపాడు పోలిశెట్టిపాడు గోపాలపురం కోదూరు జీళ్ళకుంట మరే పల్లె గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లుకు పల్లె పండగ కార్యక్రమం లో భాగంగా శనివారం కే శ్రీనివాసరావు శంకుస్థాపన కార్యక్రమాలుచేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు ఉపాధి హామీ పథకం ద్వారా 2.5 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణం చేస్తారని అన్నారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జీ కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఏ రమేష్‌రెడ్డి, వి మునియా, వీ డేవిడ్ రాజు, బి గోపిరాజు, డి రాముడు, జనసేన నాయకులు ఎం శ్రీనివాసరావు, సర్పంచులు పాల్గొన్నారు.

విశ్వశాంతి యజ్ఞంలో భాగస్వాములే..

విశాలాంధ్ర-ఏ కొండూరు : మండలంలోని చీమలపాడు దర్గా పీఠాధిపతి ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ శనివారం స్థానిక పత్రిక విలేకరులతో మాట్లాడుతూ విశ్వశాంతికై, ధర్మం, సత్యం, కొరకు ఉదయించి కాలంతో తాను పరదా చెందినా తన ఆశయంలో పయనిస్తున్న ముహమ్మద్అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారి మూడురోజుల గంధమహోత్సవానికి విచ్చేసిన అశేష భక్త జన సందోహానికి చీమలపాడుదర్గా పీఠాధిపతి ముహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పతావుల్లా షరీఫ్ షా ఖాద్రి బాబా వారి తనయులు ప్రముఖ వాస్తు శిల్పి మహమ్మద్ జాఫర్ విజయనగర పీఠాధిపతి మహమ్మద్ ఖలీల్ మహమ్మద్ బాగ్దాది మహమ్మద్ ఖాదర్ బాబు బాబా భక్తులు పాల్గొన్నారు.

ప్రజాహక్కుల ప్రదర్శన జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: డిసెంబరు 4వ తేదీన నిర్వహించ తలపెట్టిన ప్రజాహక్కుల ప్రదర్శనను జయప్రదం చేయాలని సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ పిలుపునిచ్చారు. ప్రజల నుంచి మతోన్మాద ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాటానికి సిద్ధం కావలసిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో డబుల్ ఇంజన్ పాలన దిశగా ప్రధాని మోదీ జమిలీ ఎన్నికలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాల అమలు చేపట్టని సీఎం చంద్రబాబు కేంద్రంలో విభజన హక్కులపై కనీసం ప్రశ్నించలేని దుస్థితిలో ఉన్నారని విమర్శించారు.

దళితుల పెన్షన్లు తొలగింపుపై నిరసన

విశాలాంధ్ర- కంచికచర్ల: మండలంలోని మాదిగ, మాల కులస్తులకు వారి వారి కులవృత్తులైన చెప్పులు కార్మికులు ,డప్పు కళాకారులకు గత ప్రభుత్వంలో అధికారులు పెన్షన్లు జారీ చేసారు. నేడు సామాజిక సాధికారత సర్వే పేరుతో మండల పరిధిలో గ్రామాలలో ఉండే చర్మ కార్మికులు డప్పు కళాకారులు కు చెందిన 692 పెన్షన్లను తొలగింపుకు లబ్ధిదారులకు మండల పరిషత్ అధికారి వద్దనుండి నోటీసులు జారీ చేయబడ్డాయి. ఆ నోటీసులలో మూడు రోజుల్లో తమ ఆధారాలను సమర్పించాలని నోటీసులో పేర్కొన్నారు. డప్పు కళాకారులు చర్మ కార్మికులు పెన్షన్ తొలగింపు పై నిరసనగా స్థానిక ఎంపీడీవోకి వినతిపత్రం ఇచ్చి అక్కడినుంచి భారీ ప్రదర్శనగా డప్పులతో నినాదాలు చేసుకుంటూ చెవిటికల్లు సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహంకు పూలమాల వేసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రమేష్, ముప్పాళ్ళ శివాజీ, బొక్కరవికుమార్ గండేపల్లి సర్పంచ్, రాయల నరసింహారావు, ప్రత్తిపాటి కృష్ణమూర్తి పింఛన్‌దారులు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు వెండి వస్తువుల వితరణ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారికి తెలంగాణ రాష్ట్రం కోదాడ గ్రామం భవానీనగర్‌కు చెందిన యాళ్ళా చెంచురామయ్య ధర్మపత్ని బ్రమ్మ మిత్రమ వెండితో తయారు చేసిన సుమారు 530, గ్రాముల వెండిప్లేట్, 2 గిన్నెలు అమ్మవారి దేవస్థాన అధికారులకు శనివారం ఇచ్చారు. దాతలకు అమ్మవారి వేద ఆశీర్వచనం, ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు సొసైటీ కార్యదర్శి. ఎస్.కొండలు శర్మ పాల్గొన్నారు.

జలదీశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.93,552

విశాలాంధ్ర-ఘంటసాల : కృష్ణాజిల్లా ఘంటసాల మండలం ఘంటసాల గ్రామంలో ఉన్న శ్రీ జలదీశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి హుండీని బందరు డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. ఈఓ యార్లగడ్డ వాసు మాట్లాడుతూ జలదీశ్వర స్వామి ఆలయ హుండీలోని నగదును లెక్కించగా ఆరు నెలలకు రూ.93,552 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో గొర్రెపాటి వెంకట రామకృష్ణ (ట్రస్టీ), అర్చకులు చావలి కృష్ణ కిషోర్, దాలిపర్తి చలపతిరావు, బోయపాటి రామారావు, నారగం నాగమల్లేశ్వరరావు, నవీన్, దేవదాయ శాఖ అధికారులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అట్లతద్ది వేడుకలు

విశాలాంధ్ర-కూచిపూడి : అట్లతద్ది వేడుకలు మొవ్వ మండలంలో శనివారం వైభవంగా నిర్వహించుకున్నారు. "ఆటల నోము అట్లతద్ది ఆడపిల్లలు ఊగేతద్ది" అంటూ వయస్సుతో తారతమ్యంలేకుండా ఈ పండుగను జరుపుకున్నారు. గ్రామాలలో ఉయ్యాల పండగ, గోరిం టాకు పండగగా పిలుచుకునే అట్లతద్ది వేడుకలను కన్నెపిల్లలు, ముత్తయిదువులు అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. అలాగే అట్లతద్ది ఆరట్లోయ్ముద్దపప్పోయ్ మూడట్లోయ్ అం టూ పాటలు పాడుకుంటూ ఇరుగుపొరుగు వారితో కలిసి ఉయ్యాల ఊగారు. శనివారం వేకువజాము నుంచి ఈ వేడుకలను మహిళలు, ఆడపిల్లలుప్రారంభించుకున్నారు. చంద్రోదయ ఉమా వ్రతం నిర్వహించుకొనివారి కుటుంబ ఆనవాయితీ ప్రకారం ముత్తైదువులకువాయినాలు ఇచ్చుకొన్నారు.

26న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతున్నందున మండలంలోని ప్రజాప్రతినిధులు పాల్గొనే ఈ సమావేశమునకు మండల, గ్రామస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో తప్పక హాజరు అవ్వాలని ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు

విశాలాంధ్ర-నంది గామ: పట్టణంలో పాత బస్టాండ్‌లో మద్యం షాపును ప్రారంభించడంతో దేవాదాయశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షాపును మూయించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. నిబంధనలను విరుద్ధంగా వారి ఆదేశాలను భేఖా తర్ చేస్తూ హెచ్చరిక బోర్డును తొలగించి నేడు ఉదయం నుండి మద్యం దుకాణాన్ని ప్రారంభించారు. మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

పట్టణంలో వార్డుల పరిశీలన

విశాలాంధ్ర-తెనాలి : పట్టణంలో వార్డులను తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి శనివారం విస్తృత పర్యటన చేపట్టారు. పట్టణంలోని అన్ని కాల్వలను పరిశీలించి నీటి పారుదలపై తీసుకోవలసిన జాగ్రత్తలను, సూచనలు చేశారు. కొన్ని ప్రాంతాలలో మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంలో పేరుకుపోయిన మురుగును తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. అన్ని ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లించి దోమలు నివారణకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రబలుతున్న విష జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సూచనలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని చెప్పారు. నీటిని వేడి చేసుకుని తాగాలని, వీలైనంత వరకు రోడ్లపై పదార్థాలను తినరాదని, చుట్టుప్రక్కల ప్రదేశాలలో నీటిని నిల్వ ఉంచరాదని పట్టణ ప్రజలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లకంబ క్రీడలో విద్యార్థులు శిక్షణ

విశాలాంధ్ర-తెనాలి : ఈ నెల 17,18,19 తేదీలలో వివేకానంద భవన్ బాపట్లలో నిర్వహించిన మల్లకంబ క్రీడ వర్క్‌షాప్‌లో శ్రీరావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు 12మంది మూడు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకున్నారని పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు చిలక సుందరరావు అన్నారు. ఈ శిక్షణను మల్లకంబ విశ్వ గురువుగా పిలవబడే మల్లకంబ క్రీడ కోచ్ పద్మశ్రీ ఉదయ విశ్వనాథ్ దేశ్ పాండేజీ నిర్వహించారు. పారిస్ ఒలంపిక్స్‌లో మల్లకంబ క్రీడ గురించి ప్రదర్శన ఇచ్చిన పాండేజీ దగ్గర నేర్చుకోవడం ఎంతో గర్వకారణమని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాదకుమారి అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినిలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీ లా సెట్ స్పెషల్ కేటగిరీల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

విశాలాంధ్ర-మంగళగిరి : ఆంధ్రప్రదేశ్‌లోని న్యాయ శాస్త్ర కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ లా సెట్ 2024 సంబంధించి ప్రవేశాలలో భాగంగా స్పెషల్ కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం పూర్తయింది. ఆన్‌లైన్ హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.బ్రహ్మాజీ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఎన్‌సీసీ అభ్యర్థులు 126 మంది, సీఏపీ అభ్యర్థులు 12 మంది, పీహెచ్ అభ్యర్థులు 37 మంది, స్పోర్ట్స్ అభ్యర్థులు 40 మంది హాజరయ్యారని తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలనను ఏపీ లా సెట్ 2024 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

మార్కెట్‌కు అనుగుణంగా వ్యూహాలను రచించాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : మార్కెట్‌లో మార్పులకు అనుగుణంగా వ్యూహాలను రచించి అభివృద్ధి చేస్తేనే నిలదొక్కుకుంటామని పూణెలోని బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్ ఎం.మహారాణా అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీ రిలేషన్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ లా విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'బిజినెస్ డెవలప్‌మెంట్ - సేల్స్ - డిస్ట్రిబ్యూషన్ - కెరీర్ పాత్ గ్రోత్ - ఇంటర్వ్యూ టెక్నిక్స్ - క్యాంపస్ టు కార్పొరేట్ స్పెషలిస్ట్' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహారాణా మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్వ్యూలలో విజయం సాధించాలంటే ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వడానికి ముందుగా పరిశోధనలు చేయడం, స్పష్టమైన, విశ్లేషణాత్మక సమాధానాలు ఇవ్వడం ముఖ్యమన్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను అర్థం చేసుకోవడం, ప్రశ్నించే వ్యక్తుల అంచనాలను గుర్తించడం, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉన్న వారికి ఇంటర్వ్యూలో మీరు ఎంపికవడానికి అవకాశాలను పెంచుతుందన్నారు. క్యాంపస్ టు కార్పొరేట్ అనేది విద్యార్థులను విద్యా జీవితంలో నుంచి కార్పొరేట్ ప్రపంచంలోకి మారుస్తూ, వారికి కావాల్సిన సామర్థ్యాలు, సాంకేతికతలు నేర్పిస్తుందన్నారు. ఈ మార్పు దశలో సమయపాలన, కస్టమర్ సెంట్రిక్ అనుభవం, డేటా నైపుణ్యత, వ్యాపార అవగాహన ముఖ్యమైన అంశాలుగా పరిగణించాలన్నారు. యువత ఈ మార్పులో సాఫల్యం సాధించడానికి నైపుణ్యాల పెంపు, తగిన శిక్షణ, ప్రాక్టికల్ అనుభవం పొందడం చాలా ముఖ్యమన్నారు. కంపెనీలో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదగాలంటే.. ఉద్యోగి ప్రతి దశలో నిరంతరం నేర్చుకోవడం, కొత్త సాంకేతికతలను, మార్కెట్ ధోరణులను అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. అలాగే కంపెనీలు స్థాపించాలనుకునే విద్యార్థులు సేల్స్ విభాగం ఏ సంస్థకు అయినా అత్యంత కీలకమని, ఇది నేరుగా కస్టమర్ సంతృప్తి, కంపెనీ ఆదాయ వృద్ధికి కారణం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ సోకిన చిన్నారులకు పోషకాహార కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-తెనాలి : శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి చినరావూరు- తెనాలి ఆధ్వర్యంలో శనివారం తెనాలి జిల్లా వైద్యశాల ఎ.ఆర్.టి.సెంటర్ నందు హెచ్ఐవి చిన్నారులకు పోషక ఆహారకిట్లను పంపిణీ చేశారు. మహా ప్రస్థానం సేవా సమితి సెక్రటరీ జెట్టి శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ప్రతి నెల హెచ్ఐవి చిన్నారులకు ఉచితంగా మంచి మందులు అందిస్తుందని, దానికి తోడుగా బలమైన ఆహారం ఇవ్వాలనే సంకల్పంతో కుమార్ గ్రూఫ్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, మనవత సంస్థ తెనాలి చైర్మన్ కలసాని రామచందర్ సహకారంతో పోషక ఆహారకిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి నెల రూ.1000 మరియు పోషకాహారం మా వంతు సాయంగా చిన్నారులకు అందజేస్తామని తెలిపారు. ఇందుకు సహకరించిన కొత్త సుబ్రహ్మణ్యం, కలసాని రామచంద్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ దుర్గ, సామాజిక సేవకులు కుర్రా శ్రీను, మధులత, అనూష, బి.పోతురాజు, శివారెడ్డి, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకంపై హర్షం: ఖలీలుద్దీన్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం మైనారిటీల విద్యార్థులకు మేలు చేకూరే విధంగా ఉర్దూ మాధ్యమ పాఠశాలలో ఉర్దూ భాష ఉపాధ్యాయులను వలంటీర్లుగా తీసుకువచ్చేందుకు రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకాన్ని ప్రవేశపెట్టడం పట్ల ముస్లిం మైనార్టీలో సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మహమ్మద్ ఖలీలుద్దీన్ అన్నారు. స్థానిక పొత్తూరువారితోటలోని ఆయన కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ మదర్సాల్లో వలంటీర్ల నియామకానికి మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫారూఖ్ ఆమోదం తెలిపారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 185 మదర్సాలు ఉండగా ఒక్కో మదర్సాలో ముగ్గురు చొప్పున 550 మంది విద్యా వలంటీర్ల నియామకానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని అన్నారు. చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం కోసం ఏడాదికి రూ.13 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అంచనా వేశారన్నారు. ప్రతి తరగతిలో కనీసం 15 మంది విద్యార్థులు ఉండి ఉర్దూ మాధ్యమం చదివే స్కూల్‌లలో గౌరవ వేతనం కింద ఉర్దూ భాష ఉపాధ్యాయుల నియామకానికి కేంద్రం నిధులు కేటాయిస్తుందన్నారు. కేంద్రం గత ఏడాది దీన్ని అమలు చేసిన గత ప్రభుత్వ హాయంలో వినియోగించుకోలేదని, కూటమి ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి నిబంధనల మేరకు ప్రతిపాదనలను కేంద్రానికి పంపించిందని ఆయన చెప్పారు. ఒక్కొక్క ఉపాధ్యాయుడికి నెలకు రూ.30 వేలు గౌరవ వేతనం కింద చెల్లించేలా రూ.10 కోట్లను విడుదల చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం తెలుగుదేశం ప్రభుత్వం ముస్లిం మైనారిటీల కోసం చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఖలీలుద్దీన్ చెప్పారు.

మహా మనిషి, మానవతావాది జస్టిస్ అంబటి లక్ష్మణరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా..దేశ ప్రజలందరికీ సుపరిచితుడైన అంబటి లక్ష్మణరావు మహా మనిషి, గొప్ప మానవతావాది అని, అంతరించిపోతున్న అరుదైన మానవ జీవన శైలికి ఆయన జీవితం నిలువెత్తు తార్కాణంగా నిలుస్తుందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మూల సిద్ధాంతం స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం ఆయనకు ప్రియమైనవని, సమాజంలో మానవీయ విలువలతో సమత్వం, సోదర భావంతో స్వేచ్ఛగా ఉండాలని జస్టిస్ లక్ష్మణరావు అన్నారన్నారు. జస్టిస్‌గా ఉన్నంతకాలం కూడా ఉత్తమ న్యాయమూర్తిగా..అసమాన నైతిక జీవన స్వభావానికి దర్పణంగా నిలువెత్తు నిదర్శనంగా ఆయన జీవించినట్లు తెలిపారు. పదవీ విరమణ తరువాత అవినీతి నిర్మూలన, ఎన్నికల సంస్కరణలు, రైతు సంక్షేమం, మధ్య నియంత్రణ తదితర సామాజిక అంశాలపై ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారని, రెడ్‌క్రాస్ చైర్మన్‌గా విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన సొంత గ్రామమైన వెల్లలూరులో మద్యపాన నిషేధం అమలు చేయడం..ఎప్పుడూ తగాదాలతో ఉండే గ్రామంలో ప్రశాంత వాతావరణం ఏర్పడేలా చేయటంలో అలుపెరగని కృషి చేశారని కొనియాడారు.

పాము కాటుతో మహిళ మృతి

విశాలాంధ్ర-పెదనందిపాడు : పెదనందిపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాశింబీ(60) ఇంట్లో పనిచేస్తుండగా పాము కాటుకు గురై స్థానిక ప్రాథమిక వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

ముగిసిన పల్లె పండుగ

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండలంలో ఈ నెల 14 నుంచి జరుగుతున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు ముగిశాయి. చివరి రోజు శనివారం మండలంలోని ఈమని, చింతలపూడి, దుగ్గిరాల గ్రామాల్లో కూటమి నాయకులు, అధికారులు కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు గ్రామాల్లో ఉపాధి హామీ నిధులుతో డొంకరోడ్లు, సీసీ రోడ్లు, కల్వర్టు నిర్మాణానికి టెంకాయలను కొట్టి, అర్చకులు వేదమంత్రాల నడుమ శంకుస్థాపన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ.శ్రీనివాసరావు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గుడూరు వెంకటరావు, ఇన్‌చార్జ్ ఎంపీపీ షేక్ జిలిన్, మండల పార్టీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మండల జనసేన అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, గ్రామాల సర్పంచ్‌లు సిద్దిల శ్రీవాణి ఉజ్వల హరిణి, తాడిబోయిన రామకృష్ణ, బాణావత్ ఖుషిభాయ్, ఎంపీటీసీ పసుపులేటి సాయి చైతన్య, గ్యార నిర్మల, పార్టీ నాయకులు వెనిగళ్ళ శ్రీకృష్ణప్రసాద్, వల్లూరు నరసింహారావు, దేవరపల్లి చంటి, పసుపులేటి రవియాదవ్, పసుపులేటి వరదయ్య, చుండూరు ఉమామహేశ్వరరావు, కాజా భాస్కరరావు, పర్వతనేని హర్ష, వాసిరెడ్డి సుధాకర్, కాకోతు దేవదాసు, మారుతి, రవిచంద్, ఈఓపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, పంచాయతీరాజ్ డీఈ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II ADDL.DIST. JUDGE:GUNTUR

M.V.O.P.No:1396/ 2023

Between:

Challa Anasurya & Others ... Petitioners

And

Mota Ram & Others..... Respondents

To,

R-1: Mota Ram. S/o. Dhuda Ram Megheal, R/o. H. No. 8/A,Soniyasar, Sujangarh, Udaikarnawtan, Churu-33151 (Owner Cum Driver Of The Lorry Bearing No.RJ 06 GC 2247)

R-2: Amar Chand, S/o. Hira Ram, H. No. 11, Lalamdesar, The Nokha, Bikaner, Rajasthan-334001(Owner Of The Lorry Bearing No . RJ 06 GC 2247) (As per the policy)

పై నెంబరు O.P. పిటీషనర్లు యాక్సిడెంటుకు నష్టపరిహారము కోరుచూ దాఖలు చేయగా సదరు పిటీషన్‌లో **1 & 2** రెస్పాండెంట్స్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్తపత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టువారు **డి. 13-11-2024కి** వాయిదా వేసినారు. కావున ఆ రోజున **ఉ.గం. 10-30** ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకుగల అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టువారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది : **13-11-2024**

ఎస్.సుబ్బారెడ్డి, పి.బుజ్జీ

పిటీషనర్లు తరపు అడ్వకేట్స్, గుంటూరు

దస్తావేజు పోయినది

గుంటూరు జిల్లా, పొన్నూరు మున్సిపాల్టీ, బావిరెడ్డి వారివీధి. డోర్ నెం.17-5-11 నివాసి (లేటు) పత్తేళ్ళ శేషగిరిరావు గారి కుమారుడు సత్యనారాయణ అను నేను నా తండ్రి పత్తేళ్ళ శేషగిరిరావు, S/o.రాఘవయ్య గారు నిడుబ్రోలు నివాసి సక్కా నారాయణ స్వామి గారి కుమారుడు కృష్ణమూర్తి గారికి చెందిన పొన్నూరు సర్వే నెం.390/2బి లో 121చగ ఖాళీ నివేశన స్థలను డి.23-07-2001న కొనుగోలుచేసి వ్రాయించుకొన్న రిజిష్టరు విక్రయ దస్తావేజు నెం.1652/ 2001 రీత్యా సదరు ఆస్తి నా తండ్రి గారికి సంక్రమింపబడినది.నా తండ్రి గారు కాలంచేసినారు. సదరు డాక్యుమెంటు ఫోటోస్టాట్ కాపీ అవసరమై డి.18-10-2024న మా యింటి నుండి పొన్నూరు ఐలాండ్ సెంటరుకు నడుచుకుంటూ వెళ్ళుచుండగా మార్గం మధ్యలో సదరు దస్తావేజు జారిపోయినది. సదరు దస్తావేజు పోయిన విషయాన్ని గ్రహించి నేను వచ్చినమార్గంలో ఎంత వెతికినను కనిపించలేదు. ఎవరికైనా సదరు దస్తావేజు దొరికినయెడల పై అడ్రస్‌లో తెలియజేయగలరు.

కళా రంగానికి స్టాలిన్‌బాబు లేని లోటు తీర్చలేనిది



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఘంట సాల గీతాలాపనలో రాష్ట్ర స్థాయిలో తన కంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకుని ఎంతో మంది గాయనీ, గాయకులకు మార్గదర్శి అయిన మధుర గాయకుడు, అపర ఘంటసాల బిరుదాంకితులైన స్వర్గీయ చెట్టుపల్లి స్టాలిన్‌బాబు, ఆకస్మిక మరణానికి చింతిస్తూ..శనివారం అమరా వతి రోడ్‌లోని గుంటూరు అన్నదాన సమాజం ఆడిటోరియంలో గుంటూరు గాన కళాకారుల సినీ సంగీత విభావరి పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో.. పర్య వేక్షణ కమిటీ అధ్యక్షులు మిరియాల ప్రసా దరావు అధ్యక్షతన స్టాలిన్‌బాబుకు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాలిన్‌బాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రసాదరావు, జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ కళా రంగానికి స్టాలిన్‌బాబు లేని లోటు ఎప్పటికీ తీర్చలేనిదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సంతాప సభలో పర్యవేక్షణ కమిటి ముఖ్య నాయకులు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, గాదె రత్నారెడ్డి, పెమ్మూరి కృష్ణారావు, కె.బాబురావు, డాక్టర్ శ్యామల కోటిరెడ్డి, లీగల్ అడ్వైజర్ టి.దేవదాసు, రిటైర్డ్ ఏఓ వెంకాయమ్మ, కార్యవర్గ సభ్యులు, గుంటూరు పట్టణ గాయనీ, గాయకులు పాల్గొన్నారు.

సీపీఐ నేత వేముల అచ్చిరెడ్డి సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-దాచేపల్లి : గ్రామీణ మండలంలోని కృష్ణానదీ తీరానసున్న రామాపురం గ్రామానికి సీపీఐ నాయకుడు వేముల అచ్చిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని పార్టీ సీనియర్ నాయకుడు తెలనాకుల సత్యనారాయణ అన్నారు. శనివారం రామాపురంలో వేముల అచ్చిరెడ్డి 33వ వర్ధంతి సభ నిర్వహించారు. దీనికి ఆయన కుమారుడు, పిడుగురాళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ అధ్యక్షుడు వేముల వినోద్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తెలనాకుల సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. అదేవిధంగా పార్టీ సీనియర్ నేతలు కొమెర వెంకట్రావు, మంద పాటి రమణారెడ్డి, వేముల వెంకటరెడ్డి, బుర్రి కృష్ణారెడ్డి, తమ్మిశెట్టి శ్రీరాములు, ప్రత్తిపాటి నాగరాజు తదితరులు మాట్లాడుతూ సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శిగానూ, మండల శాఖ కార్యదర్శిగానూ ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. సహకార సంఘం అధ్యక్షులుగా చేసిన ఆయన రైతులకు కూడా విరివిగా వ్యవసాయ రుణాలు ఇప్పించినట్లు చెప్పారు. గ్రామంలో అందరినీ ఐక్యపరిచి రహదారుల నిర్మాణం, పాఠశాల అభివృద్ధి, దండివాగు ఎత్తిపోతల పథకం నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి అన్నారు. రైతు సంఘ నేతగా ఉద్యమాలు చేసినట్లు వివరించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, ఎన్టీఆర్ విగ్రహాలకు కూడా పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నాయకులు వేముల వీర రాఘవరెడ్డి, ఆకూరి వీరశేఖర రెడ్డి, ఆకూరి వెంకట రెడ్డి, ఆళం అచ్చిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, నేలపాటి నరసింహారావు, మట్టా కాశయ్య, గుర్రం పుల్లయ్య, పరిమి సైదులు, చాట్ల యాకోబు తదితరులు మాట్లాడుతూ అచ్చిరెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా పల్లె పండగ

విశాలాంధ్ర-నూజెండ్ల : పల్లె పండగ కార్యక్రమాన్ని మండలంలోని ముత్తరాసుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గల అల్లిబాయపాలెంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామాలు స్వావలంబన దిశగా అడుగులు వేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరు ఉమాదేవి అన్నారు. దేశానికి పట్టుకొమ్మలు గ్రామ పంచాయతీలు అని, గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొప్పరపు వెంకటరమణ, ఇన్‌ఛార్జ్ ఈఓపిఆర్డి ప్రభాకర రావు, ఏపీఓ ఆంజనేయరాజు, పంచాయతీరాజ్ ఏఈ అల్లాబక్షు, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, మండల నాయకులు జడ్డా రామయ్య, గ్రామ పెద్దలు చౌదరి, సచివాలయ, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా రత్నమేరి

విశాలాంధ్ర - కారంపూడి : మండలంలోని ఇనుపరాజు పల్లె గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా తగరం రత్నమేరి సంతోష్ శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సర్పంచ్‌గా ఉన్న తగరం బుజ్జమ్మాయి అనారోగ్య కారణాల వలన సెలవు పెట్టడంతో రత్నమేరి సంతోష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంగులూరి అంజయ్య, గొల్ల సురేష్‌యాదవ్, మునుగోటిసత్యం, చప్పిడి రాము, మస్తాన్‌జాని, బాలకృష్ణ, బాలునాయక్, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కొండలు, నాగరాజు, రామయ్య పాల్గొన్నారు.

బస్టాండ్ సెంటర్ జలమయం

విశాలాంధ్ర-దుర్గి : వర్షానికి సైతం మండల కేంద్రమైన దుర్గి బస్టాండ్ సెంటర్ జలమయం అవుతుంది. బస్టాండు సెంటర్‌కు ఇరువైపులా తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులు ఎవరికీ వారు ఎత్తుగా మట్టిని కుప్పలుగా పోసుకోవడంతో రోడ్డు మీద పడ్డ వర్షపునీరు పోవడానికి మార్గం లేక నీరు రోడ్డుపైనే నిలిచిపోతుంది. దీంతో పాదచారులు, ప్రయాణికులు కనీసం నడవడానికి కూడా అవకాశం లేకుండా పోతుంది. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీఓ కారును ఢీకొన్న లారీ

విశాలాంధ్ర-దాచేపల్లి : గురజాల ఆర్టీఓ మురళీకృష్ణ కారును శనివారం ఓ లారీ ఢీకొంది. తంగెడ, ముత్యాలంపాడు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు ముగించుకొని దాచేపల్లి వైపు వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మార్గ మధ్యలో వెనుక నుంచి లారీ అతివేగంగా వచ్చి కారును ఢీకొంది. దీంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేదు. అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వీవీఐటీలో 'ఫెన్సింగ్' క్రీడా పోటీలు

విశాలాంధ్ర-పెదకాకాని : జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ అంతర్ కళాశాల క్రీడా పోటీలలో భాగంగా ఫెన్సింగ్ (పోరాట క్రీడ) పోటీలను వీవీఐటీ కళాశాలలో నిర్వహించారు. మూడు విభాగాలలో స్త్రీ, పురుషులకు నిర్వహించిన ఈ పోటీలలో 16 కళాశాలల నుంచి 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జేఎన్‌టీయూకే అంతర్ కళాశాలల టోర్నమెంట్ సెక్రటరీ డాక్టర్ జీపీ రాజు ప్రారంభించారు. ఈ పోటీలలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎం.వెంకటేష్, కిట్స్ కళాశాలకు చెందిన పి.సృజన్ సిన్హా, మహిళలలో చలపతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కె.రత్న కుమారి ప్రతిభ కనబరిచి ప్రథమ విజేతలుగా నిలిచారు. వారిని వీవీఐటీ అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, తదితరులు అభినందించారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర-దుర్గి : గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పల్లె - పండుగ కార్యక్రమం దోహ దపడుతుందని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రమైన దుర్గి, అడిగొప్పల గ్రామాల్లో జరిగిన పల్లె - పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు, సీసీ డ్రైన్స్ నిర్మాణాలకు దుర్గి రూ.30 లక్షలు, అడిగొప్పల రూ.25 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులకు సంబంధించిన సీసీ రోడ్లు, డ్రైన్స్ పనులకు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి భూమి పూజ గావించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, లింగా రమేష్, దొండపాటి చెన్నయ్య, తోటకూర శ్రీనివాసరావు, రుద్రాల రవి, పులి హరి, భీమా అమరయ్య, మేకల రామారావు, రామయ్య, సూరె రామకృష్ణ, కటకం రామారావు, జక్కా కొండలు, దుర్గెంపూడి జానికీరామయ్య, వెలిదండి శ్రీనివాసరావు, మాగులూరి నారాయ్య, యాగంటి నరేష్, మేకల దాసు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివప్రసాద్, ఏపీఓ చిన వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ హనుమంతరావు, సీనియర్ అసిస్టెంట్ రాజు, పంచాయతీ కార్యదర్శులు క్రిష్ణ, హాఫీజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు పెద్దపీట

విశాలాంధ్ర-శావల్యా పురం : కూటమి ప్రభుత్వం పల్లెపండగ ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసిందని టీడీపీ నాయకులు గడిపూడి విశ్వనాథనం అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని శావల్యాపురం, పొట్లూరు తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైయిన్లు, మిని గోకులాలు, పలు అభివృద్ధి పనులకు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, పంచాయతీరాజ్ ఎఈ వెంకటేశ్వరస్వామి, ఏపిఎం వాసుబాబు, టీడీపీ నాయకులు గోరింట్ల హనుమంతరావు, నల్లమాటి వెంకటేష్, పాలడుగు సత్యనారాయణ, కర్రీ పెద్ద అంజయ్య, దూదేకుల ప్రభు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణాలు అందేలా కృషి చేయండి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : మెప్మా రీసోర్స్ పర్సన్స్(ఆర్పీ)లు ఏ విధమైన ప్రలోభాలకు లోను కాకుండా అర్హులైన స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంక్‌ల నుంచి రుణాలు అందేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ స్పష్టంచేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఆర్పీలు, సీఎం ఎంలు, సీఓలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత నియోజకవర్గ పరిధిలో స్వయం సహాయక గ్రూప్‌లు, సభ్యులు ఎంత మంది, ఇప్పటివరకు అందిన రుణాలు, రీ పేమెంట్, అందించిన బ్యాంక్‌లు, మెప్మా సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మెప్మా పీడీ(ఎఫ్ఏసీ) విజయలక్ష్మీ, జీఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం రత్నమహిపాల్ రెడ్డి, ఉపా సెల్ ఓ.బాలాజీ, బాష, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహాల్లో న్యాయమూర్తి తనిఖీ

విశాలాంధ్ర - కారంపూడి : పట్టణం లోని రెండు గిరిజన సంక్షేమ పాఠశాలను, వసతిగృహాలను గురజాల 10వ బెంచ్ జిల్లా అదనపు న్యాయమూర్తి జి.ప్రియదర్శిని శనివారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ప్రిన్సిపాల్స్ నిర్లక్ష్యం బయటపడినది. తొలుత బాలుర గిరిజన పాఠశాల, వసతిగృహంలో విద్యార్థులకు రోజు గుడ్డు పెడుతున్నారా అని న్యాయమూర్తి ప్రశ్నించగా విద్యార్థుల నుంచి నిశ్శబ్దం మాత్రమే సమాధానంగా వచ్చింది. బియ్యం, వేరుశనగ సరుకులలో పురుగులు ఉంటున్నాయని ఆమె గమనించారు. బోరునుండి వచ్చిన మంచినీటిని విద్యార్థులు తాగుతున్నారు. బోరు నీటి వలన విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వాటర్ ట్యాంక్‌లపై మూతలు లేకపోవడాన్ని ఆమె గుర్తించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించిన ఆమె ఎందుకు సక్రమంగా రికార్డులు నిర్వహించడం లేదని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. అనంతరం బాలికల గిరిజన సంక్షేమ పాఠశాల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. వసతిగృహంలో కొన్ని గదులలో ట్యూబులైట్లు, ఫ్యాన్లు పనిచేయటంలేదని గుర్తించారు. స్టోర్ రూములో ఉన్న నిత్యావసర సరుకులను పరిశీలించగా ఇడ్డిరవ్వలో పురుగులు ఉన్నాయని వాటిని తీసివేయాలన్నారు. నాణ్యమైన సరుకులను వాడాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. విద్యార్థినీలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు, వసతిగృహాలలో ఉన్న సమస్యలను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి నివేదిస్తామని ఆమె తెలిపారు.

అంకమ్మతల్లికి బంగారు నగ బహూకరణ

విశాలాంధ్ర-దాచేపల్లి : స్థానిక శ్రీ వీర్ల అంకమ్మ తల్లికి కేసానపల్లికి చెందిన భక్తుడు సంకురాత్రి అశోక్ బంగారు కాసుల నగను శనివారం బహూకరించారు. దాదాపు రూ.3 లక్షలతో చేయించిన ఆ బంగారు నగను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు పలువురు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-దుర్గి : రీ సర్వే సమయంలో ఉత్పన్నమైన భూ సమస్యలను రెవిన్యూ రికార్డుల అనుగుణంగా పరిష్కరిస్తామని తహశీల్దార్ ఐ.ఫణీంద్ర కుమార్ అన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని శ్యామరాజుపురంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని కోరారు. వచ్చిన అర్జీలను ఉన్నతాధికారులకు పంపించి నిర్ణీత కాలపరిమితి లోగా పరిష్కరిస్తామని చెప్పారు. రీసర్వేలో ఎక్కువగా కొలతల్లో చిన్నపాటి వ్యత్యాసాలపై అర్జీలు అందాయని తెలిపారు. రైతులందరికీ నోటీసులు ఇచ్చి వారందరూ ఉన్నప్పుడే తిరిగి రీసర్వే చేయాలని తహశీల్దార్ గ్రామ సర్వే అసిస్టెంట్‌ను ఆదేశించారు. గ్రామ సభకు విచ్చేసిన రైతులు తమతమ భూ సమస్యలను తహశీల్దార్‌కు విన్నవించుకున్నారు తదనంతరం గ్రామ రెవిన్యూ అధికారి మేరుగ కిరణ్ కుమార్, సర్వే అసిస్టెంట్ కమలాకర్‌కు అర్జీల రూపంలో అందజేశారు. గ్రామ సభలో రైతుల నుంచి 19 అర్జీలు అందినట్లు తెలిపారు. అనంతరం రైతులు తహశీల్దార్‌ను శాలువాలతో సన్మానించారు.

ముస్తాబవుతున్న కాంగ్రెస్ కార్యాలయం

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రంలో పునర్వైభవంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ పార్టీ ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఇటీవలే ఒక్కొక్కరు ఇన్‌ఛార్జీల నియామకం పూర్తి చేస్తున్న అధిష్ఠానం నూతన కార్యాలయాల ఏర్పాటుపైనా ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటోంది. అందులో భాగంగానే వినుకొండ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ముస్తాబవుతోంది. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ పనులు చకచక సాగుతున్నాయి. వినుకొండ- కారంపూడి రహదారిలోని టీవీఎస్ షోరూమ్ ఎదురుగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు పీసీసీ అధికార ప్రతినిధి కాసరగడ్డ నాగార్జున తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేలా కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఇందుకు సంబంధించి త్వరలో పూర్తి ప్రణాళికలతో ప్రజల ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు. రాహుల్ గాంధీ పేరుతో ఛారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఆర్జీ ట్రస్టు ద్వారా వినుకొండ నియోజకవర్గవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపడతామని నాగార్జున చెప్పారు.

రెండు ప్రమాదాలు..

నలుగురికి గాయాలు

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలో శనివారం జరిగిన రెండు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. ఇరికేపల్లి అడ్డ రోడ్డుతో నడికూడి మూల మలుపు వద్ద ఒక లారీ, మూడు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. అందులో ఉన్న నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు ఆ క్షతగాత్రులను ఆసుపత్రికి పంపించారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక 35వ డివిజన్ పట్టాభిపురం మెయిన్ రోడ్డు పెట్రోల్ బంకు వద్ద కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కేంద్రాన్ని ఎమ్మెల్యే మాధవి, జోన్ 5 టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని, గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకున్న వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందేనని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాచర్ల-సాగర్ రహదారిని డబుల్ లైన్‌గా మార్చడం హర్షణీయం

విశాలాంధ్ర-విజయపురి సౌత్ : మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కృషితో మాచర్ల-సాగర్ రహదారిని (వయా కొప్పునూరు)డబుల్ లైన్‌గా మారుస్తూ 31 కోట్లు కేటాయించడం హర్షణీయమని మాచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ అన్నారు. శనివారం విజయపురిసౌత్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మాచర్లలో ఆరాచకాలే హద్దుగా చెలరేగారని, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు పంచాయితీలకు నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు సాంబశివరావు, వీపీ సౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, డాక్టర్ ఎన్.బసివి రెడ్డి, ఆడెపు కోటయ్య, గంటా ధనుంజయరావు, జనసేన అధ్యక్షుడు రాహుల్, రామచంద్, చరణ్, సిహెచ్ దేవుడు, తాతారావు, సిహెచ్ శ్రీనివాసరావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో రాజకీయాలు తగదు

విశాలాంధ్ర-ఈపూరు : రోగులకు మానవత్వంతో వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రులలో రాజకీయాలు చేయకూడదని గుంటూరు జిల్లా డీసీహెచ్ఎస్ఎంపీ మజీద బేగం అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు సామాజిక కేంద్ర సూపరింటెండెంట్ కమలాకర్ రావు ఆత్మహత్యయత్నం చేయడం, అందుకు ఆసుపత్రి సిబ్బంది కారణమని ఆయన చెప్పడంతో శనివారం విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని విచారించి, హాజరు రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 30 పడకల ఆసుపత్రికి 38 మంది సిబ్బంది ఉన్నారని, వారిలో 8 మంది వైద్యులు అని తెలిపారు. వీరంతా రోగులకు వైద్య సేవలు అందించాల్సింది పోయి రాజకీయాలు చేయటం చాలా బాధాకరమన్నారు. ఆసుపత్రి ఇన్‌చార్జ్ అంటే పదేపదే మిమ్ములను పలకరించడం కాదని తనకు రికార్డు వరకు చాలా ఉంటుందని ఇన్‌చార్జ్‌పై ఒత్తిడి పెంచడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రస్తుతం వైద్య రంగంలో నూతన విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీ అందుకు అనుగుణంగా సిబ్బంది పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదుపై ఎమ్మెల్యే సమీక్ష

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో 18,19,20 డివిజన్ తెలుగుదేశం పార్టీ కమిటీలు క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జ్ లతో ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే టీడీపీ సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం పై గుం టూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళ మాధవి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించి, పార్టీ శ్రేణులకు సభ్యత్వ నమోదు నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, కార్య కర్తల క్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని, కార్యకర్తల అభివృద్ధి కోసం నిధి ఏర్పాటు చేసిన తొలి పార్టీ తెలుగుదేశం పార్టీ అని, ఆ ఘనత టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. గతంలో కంటే ఈ సారి ఎక్కువ సభ్యత్వాలు చేసి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షులు ఉప్పుతల సాంబ, రాళ్లబండి రామరాజు, తన్నీరు కృష్ణ, రబ్బాని, ముట్టినేని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో హుండీలు లెక్కింపు

విశాలాంధ్ర-పెదకాకాని : శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం కానుకల హుండీలను దేవదాయశాఖ పర్యవేక్షణాధికారిణి ఎన్ఎల్‌టీ సౌమ్య, కార్యనిర్వహణాధికారిణి ఆగస్త్యేశ్వరస్వామి వారి దేవస్థానము, పాతగుంటూరు వారి పర్యవేక్షణలో ఉదయం 9 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో తెరచి ఆలయ కళ్యాణ మండపంలో లెక్కింపు జరిగినట్లు ఆలయ ఉపకమిషనర్, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన హుండీల లెక్కింపు కార్యక్రమం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. దేవస్థానంకు గడిచిన 90 రోజుల కానుకల హుండీల ద్వారా రూ.40,49,823లు, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.54,658లు, బంగారం 0.24.700 మి.గ్రా, వెండి 432 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ వచ్చినట్లు దేవస్థాన ఉపకమిషనర్ తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థాన ఉపకమిషనర్ గోగినేని లీలాకుమార్, కార్యాలయ సిబ్బంది, సీజీజీ బ్యాంకు, పెదకాకాని శాఖకార్యనిర్వహణాధికారి బి.సువర్ణరాజు, బ్యాంకు సిబ్బంది, సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అలవాట్లు, పోషకాహారంపై అవగాహన

విశాలాంధ్ర-తాడేపల్లి : ఆరోగ్యకరమైన అలవాట్లు, పోషకాహారం తీసు కోవటం వలన ఆరోగ్య జీవితంతో పాటు జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చునని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ సూచించారు. వర్సిటీలోని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ డేటా సైన్స్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం తాడేపల్లి మండలంలోని చిర్రావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జంక్ ఫుడ్ తినటం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాఠశాల విద్యార్థులకు వివరించినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత కాలంలో మానవుని జీవనశైలి పూర్తిగా మారిపోయిందని, ముఖ్యంగా మొబైల్ వచ్చిన తరువాత సోషల్ మీడియాలో పడి సమయమే తెలియకుండా పోయిందని, ఆహారపు అలవాట్లు కట్టు తప్పాయని, శారీరక శ్రమ, వ్యాయామం ఉండటంలేదని, కంటి నిండా నిద్ర కూడా కరువైందన్నారు. చదువులు, పరీక్షలు, ఉద్యోగాల వలనే ఒత్తిడికి గురవుతున్నారని, దీంతో చిన్న వయస్సులోనే మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి సమస్యలు చుట్టుముడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ వి.జోనితిన్, సమన్వయకర్త పి.సురేష్‌లను యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్ తదితరులు అభినందించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలంటూ వినతులు

విశాలాంధ్ర-వినుకొండ: ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేసేవరకూ వివిధ దశలలో వినతి పత్రాలు అందిస్తూ, నిరసనలు తెలియచేస్తూ విద్యార్థుల పక్షాన పోరాడాలని నిర్ణయించినట్లు రాష్ట్ర విద్యార్థి యువసేన అధ్యక్షులు సంపెంగుల రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సమావేశం ముగిశాక తెలుగుదేశం పార్టీ నాయకులను కలిసి వారికి వినతి పత్రాలు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో వున్న ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ లను విడుదల చేయాలని, అలాగే జనవరి నుంచి పెండింగ్‌లో వున్న సంక్షేమ హాస్టల్‌లో మెస్ బిల్లులు విడుదల చేయాలని, హాస్టల్ లో కనీస మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం తిరిగి అమలు చేయాలని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, ఎమ్మెల్సీ షరీఫ్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని ఆపివేసి ఎంతో మంది పేద ఇంటర్ విద్యార్థులను ఆకలితో అలమటించేలా చేసిందని, జీవో నెంబర్ 77 ద్వారా పీజీ విద్యార్థులకు స్కాలర్ షిప్ ఆపివేసిందని, అలాగే సంక్షేమ హాస్టల్ లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో విఫలం అయిందని పేర్కొన్నారు. అప్పుడు మేము ఎన్నో ధర్నాలు, నిరసనలు చేసి విద్యార్థులకోసం ఉద్యమిస్తున్నప్పుడు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కలిసి అయినకు వినతి పత్రం అందించామని, టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని పథకాలు తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం వచ్చి 4 నెలలు పైనే అయింది.. ఇకనైనా సమస్యలపై దృష్టి సారించి విద్యార్థులకు న్యాయం చేసే విధంగా ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి దృష్టికి మరోసారి తీసుకువెళ్లాలని విన్నవించుకున్నారు. సమస్యలు విన్న ఎమ్మెల్సీ షరీఫ్, వర్ల రామయ్య విద్యార్థుల సమస్యలను చంద్రబాబు, లోకేష్‌లకు తెలియజేసి, త్వరలో పరిష్కరించి న్యాయం చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

చట్టాలను పారదర్శకంగా అమలు చేయాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల : రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను పారదర్శకంగా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు బిసి సంక్షేమ సంఘం నాయకులు, బీసీలు ఘనంగా స్వాగతంపలికారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఎట్రాసిటీ చట్టంలాగా బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. ఆయా వృత్తులు చేస్తున్న బీసీ కులాల వారికి రక్షణ చట్టం ఎంతో అవసరమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీసీ రక్షణ చట్టం అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని హెచ్చరించారు. అనంతరం శంకరరావును బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, మండల నాయకులు ముక్కుదాల శ్రీనివాసరావు, వెంగళరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సామాగ్రి చోరీ

విశాలాంధ్ర-దాచేపల్లి : గ్రామీణ మండలంలోని మాదినపాడు వద్ద త్రీ ఫేస్ విద్యుత్ పనులు జరుగుతున్నాయి. ఆ గుత్తేదారు వాటికి సంబంధించిన సామాగ్రిని ఒక గిడ్డంగిలో ఉంచారు. ఆ పరికరాలను కొంతమంది అపహరించారు. దీంతో ఆ గుత్తేదారు స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ద్విచక్ర వాహనాల చోరీ

విశాలాంధ్ర-దాచేపల్లి : తంగెడ, నడికూడి, దాచేపల్లి, నారాయణపురంలోని కూడలి ప్రాంతాల్లో నాలుగు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాపారావు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర-పెద నందిపాడు : పెదనందిపాడులో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ఆర్ అండ్ బి రోడ్డుకు శనివారం తాత్కాలిక మరమ్మతులను ఆర్ అండ్ బి అధికారులు చేపట్టారు.

పిడుగుపాటుకు ఒకరి మృతి

విశాలాంధ్ర-పెదకూరపాడు: అచ్చంపేట మండల పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన గడ్డం హనుమంతరావు(65) శనివారం మధ్యాహ్నం పిడుగుపాటుకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల్లోకెళితే రుద్రవరం కోగంటివారిపాలెం గ్రామాల మధ్య పశువులు కాస్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది అని తెలిపారు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రుద్రవరం గ్రామంలో గురవయ్య మృతి చెందడంతో బంధువులు, స్నేహితులు శోకసముద్రంలో ఉన్నారు.

అయ్యప్ప మాలదారుడు గల్లంతు

విశాలాంధ్ర-పిడుగురాళ్ళ: గుత్తికొండ గ్రామంలో మధ్యాహ్నం సద్దిసమయానికి స్నానం ఆచరించేందుకు జూలకల్లు బ్రాంచి కెనాల్‌లోకి దిగిన అయ్యప్ప మాలధారుడు గల్లంతు అయ్యాడు. జూలకల్లు గ్రామానికి చెందిన గుడె శ్రీనివాసరావు(35) తన తోటి స్వాములతో కలిసి గుత్తికొండ బ్రిడ్జి వద్ద స్నానానికి దిగగా లోతు గమనించక పోవడంతో శ్రీనివాసరావు గల్లంతైనట్లు తోటి మాలధారులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న గ్రామీణ ఎస్.ఐ మోహన్ గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-రొంపిచర్ల: ప్రభుత్వ పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక బీసీ కాలనీలో గల మండల విద్యా వనరుల కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా పాఠశాల, మండల విద్యా వనరుల కేంద్రం, అంగన్వాడీ కేంద్రంలో గల రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టికను, ఉపాధ్యాయుల పని తీరును, మధ్యాహ్న భోజన పథకమును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య నందించాలని అన్నారు. విధులను సక్రమంగా నిర్వహించని వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థుల డ్రాపవుట్స్ తగ్గించి, హాజరు శాతాన్ని పెంచాలన్నారు. ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆర్.వకులాదేవి, అంగన్వాడీ టీచర్ నాగమల్లేశ్వరీ, ఎం.ఆర్సి పచ్చవ రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెదనందిపాడు : సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్ళు లాంటివి అని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. పల్లె పండగ, పంచాయతీ వారోత్సవాలలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో పెదనందిపాడు గ్రామంతో పాటు పలు గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలకు ఎమ్మెల్యే శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇద్దరికి పనితో పాటు సంక్షేమం చేపడతామని చెప్పారు. ప్రతి ఇంటికి లక్ష రూపాయల లబ్ధి చేకూరుతుందన్నారు. ఆయా కార్యక్రమాలలో మండల అధికారులు, టీడీపీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాల్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-మాచర్ల : దాల్ మిల్లర్స్ వ్యాపారులు నాణ్యమైన ఉత్పత్తులను అందించి ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల దుర్గి దాల్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా దాల్ మిల్లర్స్‌కు టీడీపీ అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందన్నారు. నూతన పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంలో అనువైన వాతావరణం కల్పించడంతో పాటు వారికి ప్రభుత్వం నుండి రావలసిన అనుమతులను సత్వరమే అందించేందుకు వ్యవస్థను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన గుడిపాటి శేషు, కార్యదర్శి చుండూరు పూర్ణచంద్రరావు, కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరు నరసింహారావు, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, కజ్జం సైదయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సమగ్ర అవగాహన ఉండాలి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నగరపాలక సంస్థ పరిధిలోని వార్డ్ సచివాలయ కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలో సమస్యలు, పరిష్కార మార్గాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, స్థానికంగా ఉండే సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీ, నల్లకుంట, శ్యామలా నగర్, పలకలూరు రోడ్, ఉద్యోగ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులను ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో కలిసి శనివారం కమిషనర్ పరిశీలించారు. తొలుత ఎన్‌జీఓ కాలనీ మున్సిపల్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం, డ్రైన్లను పరిశీలించి సంబంధిత సచివాలయ శానిటేషన్, ఎమినిటి కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య కార్మికులు ప్రతి రోజు ఉదయం ఇంటింటి చెత్త సేకరణ చేస్తారని, వారితో సచివాలయం పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో గ్యాంగ్ వర్క్ ద్వారా కాల్వలు శుభ్రం చేయించడంలో కార్యదర్శులు తీవ్ర నిర్లక్ష్యంగా ఉంటున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమస్య తీవ్రత అధికంగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి కార్యదర్శులు తీసుకురావాలన్నారు. నగరంలో డ్రైన్ నిర్మాణం అనంతరమే రోడ్లు నిర్మాణం చేయాలని, నూతనంగా నిర్మాణం చేసే రోడ్లు తప్పనిసరిగా డ్రైన్ టు డ్రైన్ ఉండేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. నూతన డ్రైన్, రోడ్లు నిర్మాణ సమయాల్లోనే ఆక్రమణలు తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నివాస ప్రాంతాల మధ్యలో ఖాళీ స్థలాల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆయా స్థల యజమానుల వివరాలు తెలుసుకొని, శుభ్రం చేసుకోవాలని, లేకుంటే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని నోటీసులు ఇవ్వాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దపలకలూరు రోడ్‌లోని రిజర్వాయర్, వాల్స్ పిట్‌లను పరిశీలించారు. ఈ పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, కార్పొరేటర్ వి.శ్రీరామ్ ప్రసాద్, డీఈఈలు మధుసూదన్, నాగభూషణం, ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎంహెచ్ఓ ఆనందకుమార్, టీపీఎస్ లక్ష్మణ స్వామి, ఏఈలు నాగవేణి, చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొండయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : వినుకొండ మండలం దొండపాడు గ్రామంలో కొండయ్య అనే 51 సంవత్సరాలు రైతు శుక్రవారం మధ్యాహ్నం గొర్రెలకు మేత పెట్టేందుకు పొలంకు వెళ్లగా ఉరుములు, మెరుపులు వచ్చి పిడుగుపడి అక్కడికక్కడే కొండయ్య అనే రైతు మరణించడం జరిగిందని, చుట్టుపక్కల రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. కొండయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు, కొడుకు థర్డ్ ఇయర్ బీఎస్సీ నర్సింగ్ చదువు

ఉలవలపూడి రాము

తున్నాడని కొండయ్య సంపాదన మీదే ఆ కుటుంబం ఆధారపడి ఉందని భార్యకు గత ఏడాది పాము బారినపడి ఆమెకి కాలు పని చేయట్లేదని, కొడుకు చదువు మధ్యలో ఉన్నదని ఆ గ్రామస్తులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాముకి కొండయ్య కుటుంబ పరిస్థితి వివరించారు. రాము మాట్లాడుతూ రైతు కొండయ్యకు కూటమి ప్రభుత్వం కొండయ్య కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పల్నాడు జిల్లాలో పిడుగుబారిన పడి మరణించిన కుటుంబాలని గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం ఆ కుటుంబాలను కూడా ఆదుకోవాలని ఉలవలపూడి రాము కూటమి ప్రభుత్వాన్ని రైతుల పక్షాన కోరారు. రైతులు కొప్పరపు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర-చిలకలూరి పేట : సంక్షేమం, అభివృద్ధి మేళవింపుగా ప్రజాపాలన అందిస్తామన్న కూటమి నినాదానికి నిదర్శనమే రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శనివారం చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, నాదెండ్ల మండలం కనపర్రులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శంకుస్థాపన చేశారు. కమ్మవారిపాలెంలో రూ.7.5 లక్షలతో రహదారి, కనపర్రులో రూ.20 లక్షలతో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతోనే 5 సంతకాలతో సంక్షేమశకానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు 4 నెలల స్వల్ప వ్యవధిలోనే ఇక్కడ అమరావతి, అక్కడ పోలవరం పనులు ఏకకాలంలో తిరిగి పట్టాలెక్కించడానికి చేస్తున్న కృషిని ప్రతి ఒక్కరూ హర్షిస్తున్నారన్నారు.

రజక జనసేవా సంఘ ఐక్యతకు కృషి చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవా సంఘం బలోపేతానికి.. ఐక్యతకు ప్రతి ఒక్క రజకుడు కృషి చేయాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పాత గుంటూరు శ్రీ గంగానమ్మ కమ్యూనిటీ హాలులో గుంటూరు టౌన్ రజక జనసేవా సంఘం ఆధ్వర్యంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి చర్చించి పరిష్కరించేందుకు బహిరంగ సభ శనివారం నిర్వహించారు. సభ ప్రారంభ ఉపన్యాసం మెట్టపల్లి మహేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు గుంటూరు పట్టణంలోని ఐదు పేటల్లో ఉన్న రజకులు పాల్గొని సంఘంలో జరుగుతున్న లోటు పాట్లు గురించి చర్చించారు. అనంతరం జూపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా రజకులు నానా ఇబ్బందులకు గురైనట్లు ఆవేదన వ్యక్తంచేశారు. అక్రమ కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశారన్నారు. పట్టణంలో ఉన్న రజకులకు చెందిన నాలుగు చెరువుల్లో మూడు చెరువులు కబ్జాకు గురైనట్లు తెలిపారు. మిగిలిన ఎర్ర చెరువును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈమని ఉమామహేశ్వరరావు, మోతుకూరి ఆంజనేయులు, కటివరపు వీరాస్వామి, గుంటూరు గణేష్, పిడుగురాళ్ల సురేష్, తాటినాడ రాము, ఉదయగిరి కృష్ణ, వట్టికూటి సాంబయ్య, పెనుమాక రమాదేవి, లింగాల బిక్షం, గుంటూరు నరసింహ రావు, వీరవల్లి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ స్థలాన్ని పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక మార్కాపురం రోడ్‌లో పసుపులేరు బ్రిడ్జి నందు ఉన్న డంపింగ్ స్థలం నందు లెగసీ వేస్ట్ ట్రీట్మెంట్ జరిగే తీరును ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచన మేరకు వినుకొండ పట్టణ మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పరిశీలించారు. అనంతరం డంప్ సైట్ నిర్వహణ పేలవంగా ఉన్నదని, డంపింగ్ స్థలం పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని, మున్సిపాలిటీ డ్రైవర్స్ డంపింగ్ స్థలంకు వెళ్లే దారులలోనే చెత్తను వదులుతున్నారని డంప్ సైట్ లోపలి ప్రాంతంలో డంప్ చేసేలాగా చూసుకోవాలని సూచించారు. నెలకు ఒకమారు డంపింగ్ స్థలంలో వచ్చే చెత్తను జేసీబీ సాయంతో గుట్టలుగా ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాపారస్తులు అరటిబోదెల్ని పట్టణ శివారు రహదారుల ఇరువైపులా పారవేయకుండా పల్నాడురోడ్ నందు ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మానేజ్మెంట్ ప్లాంట్ నందు విండ్రోస్ అనే పద్ధతి ద్వారా ఎరువు తయారీ చేయడానికి ఇవ్వాలని, మెడికల్ షాప్ యజమానులు అవుట్ డేటెడ్ మెడిసిన్స్ ను ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై వేయకుండా సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నియమాల ప్రకారమే నిర్వహణ చేయాలని హెచ్చరించారు.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో గుంటూరు జిల్లా క్రీడాకారుల హవా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన 35వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లాకి చెందిన షేక్.రోషన్, హమీద్, ఎండి ఆసియాలు మూడు బంగారు, ఒక రజిత పతకాలు సాధించినట్లు సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. షేక్.రోషన్ అండర్-20 బాలుర విభాగంలో 110 మీటర్ల హర్డిల్స్, వంద మీటర్ల పరుగులో బంగారు పతకం, ఎండి ఆసియా అండర్-16 బాలికల షాట్‌పుట్‌లో బంగారు పతకం, షేక్.హమీద్ రిలే పరుగులో రజిత పతకం సాధించారు. సౌత్ జోన్ పోటీల్లో పథకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్ సంఘం చైర్మన్ జి.శేషయ్య, ఉపాధ్యక్షులు డాక్టర్ శివ కుమార్, సంయుక్త కార్యదర్శి జి.ఉషారాణిలు అభినందించారు.

ప్రతీ గ్రామం అభివృద్ధి పథం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రెంటచింతల: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం మండలం లోని రెంటచింతల, పాల్వాయి గేట్ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు నడుమ అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెంటచింతలలో రూ.50 లక్షల వ్యయంతో 8వ వార్డు, సుబ్బన్న తోట, బస్టాండ్ సమీపంలోని రెండు దేవాలయాల నడుమ రహదారులకు, పాల్వాయి గేట్ లో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి భూమి పూజ చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, సుమంత్ రెడ్డి, ఏమూరి వెంకట సైదయ్య, నాళం బాబు, ఆకుల నరసింహారావు, సీనియర్ నేత దండే శివయ్య తదితరులు పాల్గొన్నారు.

యువత స్కిల్స్ పెంపొందించుకోవాలి

-హెచ్ఎం కాంక్లీవ్ సదస్సులో ఎపిఎస్ఎస్ఐసి సీఈవో గణేష్‌కుమార్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: యువతకు కావాల్సిన స్కిల్స్ పెంపొందించడంతో పాటు వారికి చక్కటి ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా స్కిల్స్ సెంటర్ పనిచేస్తుందని ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎస్ఐసి) ఎండి అండ్ సీఈవో జి. గణేష్ కుమార్ అనా . ది ఐటి అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతి ఛాప్టర్ ఆధ్వర్యంలో శనివారం న' ంలోని హెరీటల్ ఫార్ట్యూన్ మురళి నందు ' స్కిల్ డెవలప్మెంట్ ' హెచ్.ఆర్.కాంక్లేవ్ జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న గణేష్ కుమార్ మాట్లాడుతూ నేడు ఉద్యోగ అవకాశాలు వివిధ కంపెనీలలో ఉన్నాయని అయితే సరైన స్కిల్క్ లేనికారణంగా యువతను ఎంపిక చేయలేకపోతున్నామని ఆయా కంపెనీలు చెపుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉ ంచుకుని ఎపి స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ప్రత్యేకంగా యువతలో స్కిల్స్, నైపుణ్యతను పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా స్కిల్ సెన్సెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దీని ద్వారా వివిధ సంస్థలు అసోసియేషన్లతో భాగస్వామ్యం ద్వారా వివిధ సదస్సులు . సెమినార్లు, పెంపొందించేందుకు వర్క్షాపులను నిర్వహించినైపుణ్యత, మార్గాలను తెలియచేస్తున్నామని తెలిపారు. ఐటి అసోసియేషన్ స్కిల్ డెవలప్మెంట్పై చక్కటి సదస్సు నిర్వహించారని ఈసందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఎస్టిపిఐ (సాఫ్టవేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా) విజయవాడ సెంటర్ జాయింట్ డైరెక్టర్ బి. వినయ్కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో పెద్ద స్థాయిలో వివిధ కార్పొరేట్ సంస్థలు వచ్చాయని, యువతకు ఉపాధి కూడా కల్పిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగడపతాయని తెలిపారు. హెచ్సిఎల్ టెక్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివ ప్రసాద్ మాట్లాడుతూ యువతలో నైపుణ్యతను పెంపొందించేందుకు పరిశ్రమ, విద్యా సంస్థలతో అనుసంధానంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇటీవల కాలంలో ఎక్కడ చూసినా స్కిల్స్ లేవని అందుకే ఉద్యోగ అమాకాశాలు రావడం లేదని చెపుతున్నారన్నారు. స్టూడెంట్సుకు స్కిల్స్ నేర్పించడంతో పాటు, ప్రతి ఏటా ఫ్యాకల్టీకి కూడా స్కిల్ సదస్సులను నిర్వహించడం వలన వారు విద్యార్థులకు ఇంకా నైపుణ్యతను జోడించి చెపుతారని అన్నారు. ఆవిధంగా విద్యా సంస్థలు ఫ్యాకల్టీ సదస్సులను కూడా నిర్వహించాలని పేర్కొన్నారు. ఐటి అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట అధ్యక్షులు దాసరి రామకృష్ణ మాట్లాడుతూ ఐటి అసోషియేషన్ సంస్థ విద్యార్థులలో ముఖ్యంగా యువతలో స్కిల్సును పెంపొందించేందుకు, అలాగే పరిశ్రమకు ఎటువంటి సిబ్బంది అవసరమో తెలియచేసేందుకు తొలిసారిగా హెచ్.ఆర్.కాంక్లీవ్ను నిర్వహించినట్ల తెలిపారు. ఈసదస్సుకు వివిధ విద్యా సంస్థల నుండి హెచ్.ఆర్.నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నేటి పరిశ్రమకు సంబంధించి భవిష్యత్తులో ఎటువంటి సిబ్బందిఅవసరమో కూలంకుషంగా తెలియచేశారు. ఈకార్యక్రమంలో ఐటిఎపి చైర్మన్ ఇంద్రజిత్, అధ్యక్షులు లక్ష్మీ ముక్కవిల్లి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో ఆర్కే కాలేజీ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : కేతనకొండ ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో వశిష్ట సాఫ్ట్వేర్ సర్వీసెస్ అనే బెంగుళూరు సంస్థ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్ లో 15 మంది విద్యార్థులు సాఫ్ట్వేర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకి చెందినటువంటి ఈ సాఫ్ట్వేర్ సంస్థ ఆర్కే ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ లో , మొదటి రౌండ్ గ్రూప్ డిస్కషన్, రెండవ రౌండ్ టెక్నికల్ ఇంటర్వ్యూ మరియు మూడవ రౌండ్ ఫేస్ టు ఫేస్ రౌండ్ నిర్వహించగా వచ్చినటువంటి రిక్రూట్మెంట్ టీం 15 మంది విద్యార్థులకు అవకాశం కల్పించింది. ఎంపికఅయిన 15 మంది విద్యార్థులు మార్చిలో ఆంబోర్డింగ్ అవుతారు అని పేర్కొన్నది. ఆ సాఫ్ట్వేర్ సంస్థ సెలెక్ట్ అయిన 15 మందికి అసోసియేట్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ అర్హతను అందజేసింది. కాలేజీ చైర్మన్ శ్రీ మద్దులూరి మాలకొండయ్య , సెక్రటరీ మహేంద్రనాథ్ , ట్రెజరర్ అమర్నాథ్ , ప్రిన్సిపల్ డాక్టర్ కొంద్రగుంట రామకృష్ణయ్య , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఐ సాయిరాం , ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర సంతోష్ కుమార్ అలాగే కాలేజీ యాజమాన్యం మరియు ఫ్యాకల్టీ అందరూ సెలెక్ట్ అయిన 15 మంది విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

400 మంది సామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ విద్యార్థులకు ఫ్యూచర్-టెక్ స్కిల్స్ సర్టిఫికెట్లు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సామ్‌సంగ్ ఇండియా యొక్క ప్రతిష్టాత్మక సీఎస్ఆర్ ప్రోగ్రాం, సామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్, ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలోని గౌతమ బుద్ధ విశ్వవిద్యాలయంలో 400 మంది విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సును ముగించింది. ఇది దేశానికి బలమైన భాగస్వామిగా ఉండాలనే బ్రాండ్ నిబద్ధతను పునరుద్ఘాటించింది. దేశంలోని యువతను నైపుణ్యం అందించటం, డిజిటల్ ఇండియాను శక్తివంతం చేయడం అనే మిషన్‌లో భాగంగా ప్రభుత్వంతో కలిసి పని చేస్తోంది. గౌతమ్ బుద్ధ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ ఆర్.కె. సిన్హాతో పాటు సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధికారులు హాజరైన సన్మాన కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఏవోఐలో విజయవంతంగా అత్యంత క్లిష్టమైన లారింజెక్టమీ శస్త్రచికిత్స

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పునరావృత స్వరపేటిక క్యాన్సర్ (వాయిస్ బాక్స్ క్యాన్సర్)తో బాధపడుతున్న 47 ఏళ్ల వ్యక్తి అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ (ఏఓఐ)లో విజయవంతంగా చికిత్స పొందారు. క్యాన్సర్ చికిత్సలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తూ, డాక్టర్ ఇషాంత్ అయినపూరి, ఆయన బృందం ఈ శస్త్రచికిత్సను అత్యంత నైపుణ్యంతో విజయవంతంగా నిర్వహించింది. రోగి సాంబశివరావు, 9 నెలల ముందు కీమో రేడియోథెరపీ పూర్తి కోర్సు చేయించుకున్నారు. పునరావృత, అత్యంత సంక్లిష్టమైన పరిస్థితితో రావటంతో, వైద్య బృందం ఈ సాల్వేజ్ శస్త్రచికిత్సను నిర్వహించింది. శస్త్రచికిత్స చేసిన 40 రోజుల తర్వాత, రోగి యొక్క గాయం పూర్తిగా నయమైంది. స్పీచ్ ఫంక్షన్‌ను పునరుద్ధరించడంలో సహాయపడటానికి ఆరు నెలల్లో వాయిస్ ప్రొస్థెసిస్ ప్రక్రియ ప్రణాళిక చేయబడింది. చికిత్స విజయవంతంగా నిర్వహించడం పట్ల సీటీఎస్ఐ-దక్షిణాసియా సీఈఓ హరీష్ త్రివేది, ఏఓఐ మంగళగిరి ప్రాంతీయ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహేందర్ రెడ్డి హర్షం వెలిబుచ్చారు. చికిత్స నిర్వహించిన సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఇషాంత్ అయినపూరిని వారు అభినందించారు.

'మెట్రో - ఫెస్టివ్ గిఫ్ట్'తో మెట్రో క్యాష్ అండ్ క్యారీ రెండు దశాబ్దాల వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రముఖ సంఘటిత హోల్‌సేలర్, ఫుడ్ స్పెషలిస్ట్ అయిన మెట్రో క్యాష్ అండ్ క్యారీ, భారతదేశంలో తమ కార్యకలాపాలను ప్రారంభించి విజయవంతంగా 21 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిన్న, స్వతంత్ర వ్యాపారాల కోసం తన 21వ పండుగ ఆఫర్ 'మెట్రో - ఫెస్టివ్ గిఫ్ట్'ను ప్రారంభించింది. దేశంలోని అన్ని మెట్రో హోల్‌సేల్ దుకాణాల్లో ఇది అందుబాటులో ఉంటుంది. ఈనెల 1న ప్రారంభమై నవంబర్ 3 వరకు 35 రోజుల పాటు జరిగే ఈ వేడుకలో ప్రత్యేక పండుగ బహుమతుల ఆఫర్‌లను పొందవచ్చు. ఇది అధికారికంగా కొనసాగుతుంది. మెట్రో హోల్‌సేల్ స్టోర్‌లు కాకుండా, ప్రత్యేకమైన బహుమతి ఆఫర్‌లు, డీల్‌లను మెట్రో వెబ్‌సైట్, మెట్రో హోల్‌సేల్ యాప్‌లో కూడా పొందవచ్చు.

టొయోటా నుంచి గ్లాంజా ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పండుగ స్ఫూర్తిని మరింత పెంచుతూ, టొయోటా కిర్లోస్కర్ మోటార్, టొయోటా గ్లాంజా యొక్క 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ను పరిచయం చేస్తున్నట్లు ప్రకటించింది. కస్టమర్‌లు ఇప్పుడు ప్రత్యేకమైన డీలర్ ఫిట్టెడ్ టొయోటాజెన్యూన్ యాక్సెసరీ (టిజిఎ) ప్యాకేజీలను ఆస్వాదించవచ్చు, ఈ పండుగ కాలంలో గ్లాన్జా యొక్క మెరుగైన శైలి, పనితీరు, సౌలభ్యంతో వారి డ్రైవింగ్ అనుభవాన్ని మెరుగుపరచడానికి రూపొందించ బడింది. అధునాతన సాంకేతికత, సొగసైన డిజైన్, అధిక ఇంధన సామర్థ్యం కలిగిన పరిమిత ఎడిషన్ టొయోటా గ్లాన్జా రూ.20,567 విలువైన 13 ప్రత్యేకమైన టిజిఎ ప్యాకేజీతో వస్తుంది.

రూ. 18,999 ధరలో గెలాక్సీ ఏ16 5జి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, భారతదేశంలో గెలాక్సీ ఏ16 5జిని విడుదల చేసింది. రూ.18,999ల సరసమైన ధరలో వినియోగదారులకు అద్భుతమైన ఆవిష్కరణలను అందజేస్తూ, ఆరు తరాల ఓఎస్ అప్‌గ్రేడ్‌లు, ఆరేళ్ల భద్రతా నవీకరణలను అందించడం ద్వారా మధ్య శ్రేణి స్మార్ట్‌ఫోన్‌ల కోసం కొత్త ప్రమాణాన్ని గెలాక్సీ ఏ16 5జి నిర్దేశించనుంది. సామ్‌సంగ్ గెలాక్సీ ఏ16 5జి రెండు వేరియంట్‌లలో లభిస్తుంది. గోల్డ్, లైట్ గ్రీన్, బ్లూ బ్లాక్ వంటి అధునాతన రంగుల్లో రిటైల్ స్టోర్‌లు, సామ్‌సంగ్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉంటుంది.

ప్రపంచఆర్థరైటిస్ దినోత్సవం 2024 సందర్భంగా ఆర్థరైటిస్ పై అవగాహన పెంపు

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేసే ఆర్థరైటిస్ అనేది నొప్పి, అసౌకర్యం మరియు వైకల్యానికి ప్రధాన కారణంగా ఉంటోంది. ఏటా అక్టోబర్ 12న, ఆర్థరైటిస్తో జీవిస్తున్న వ్యక్తులు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి అవగాహన కల్పించడానికి మనం ప్రపంచ ఆర్థరైటిస్ డే ని నిర్వహించుకుంటాం. ఈ సందర్భంగా విజయవాడలోని సాయి భాస్కర్ హాస్పిటల్ చీఫ్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ నరేంద్ర రెడ్డి బుసి రెడ్డి సకాలంలో రోగనిర్ధారణ, మెరుగైన ఫలితాలకు దారి తీసే అవగాహనతో కూడిన చికిత్స ఎంపికల అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ సంవత్సరం థీమ్ 'అవగాహనతో కూడిన ఎంపికలు, మెరుగైన ఫలితాలు' అనేది తమ ఆరోగ్యం గురించి అవగాహనతో కూడిన నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా వారికి జ్ఞానంతో సాధికారత కల్పించాల్సిన అవసరాన్ని చాటిచెబుతుందన్నారు. ఆర్థరైటిస్ను అర్థం చేసుకోవడం ద్వారా మనం ముం దస్తుగా రోగనిర్ధారణ, మెరుగైన చికిత్స, మెరుగైన నిర్వహణ వ్యూహాలను ప్రోత్సహించగలం, అంతి మంగా అది, రోగులకు మెరుగైన ఫలితాలకు దారి తీస్తుందన్నారు. అందుకే ఇది రోగులకు ముందస్తు లక్షణాలను గుర్తిం చడం, వారి దీర్ఘకాలిక ఫలితాలను మెరుగుపరిచే అవగాహనతో కూడిన ఆరోగ్య సంరక్షణ ఎంపిక లను చేయడాన్ని చాలా కీలకంగా మారుస్తుందన్నారు. ముందస్తు రోగ నిర్ధారణ కీలకం ఈ సంవత్సరం థీమ్ ప్రధాన సందేశాలలో ఒకటి సత్వర డయాగ్నసిస్ యొక్క ప్రాధాన్యమన్నారు. ఆర్థ రైటిస్ను ముందస్తుగా గుర్తించడం అనేది కీళ్లు మరింతగా దెబ్బ తినకుండా ఉండేందుకు, జీవిత నాణ్యతను మెరుగుపరిచేందుకు తోడ్పడుతుందన్నారు. .

సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలి

విశాలాంధ్ర - చల్లపల్లి : సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని విజయ క్రాంతి కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివ రామ ప్రసాద్ పేర్కొన్నారు . కళాశాల ఆవరణలో అంగరంగ వైభవంగా అట్లతద్ది వేడుకలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఉయ్యాలను ఏర్పాటు చేసారు. విద్యార్థుల కు మన సంప్రదాయాల పై అవగాహనా కల్గించారు.

ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశభవనంలో శనివారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారుల అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎం.ఈ.ఓ.- 1 జి. జగన్ మోహన్ రావు మరియు ఎమ్.ఈ ఓ-2 జి. గోపాల్ రావు పాఠశాలలో అమలు అవుతున్న పథకాలు మరియు కచ్చితంగా అమలు పరచవలసిన కొన్ని ముఖ్య కార్యక్రమాలపై ప్రధానోపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. ఈ అంశాలలో ముఖ్యంగా ఉపాధ్యాయుల హాజరు ఉదయం 9 గంటల లోపు మరియు విద్యార్థుల హాజరు గంటల 9:30 నిమిషాలలోపు అటెండెన్స్ ఆప్ నందు కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని, టీ.ఎం.ఎఫ్ పోటోల కాప్చర్ ను ప్రధానోపాధ్యాయులు, సచివాల సిబ్బంది మరియు పాఠశాల కమిటీ సభ్యులు కచ్చితంగా పర్యవేక్షించాలని, అదేవిధంగా పాఠశాల పనివేళ ముగిసేలోపు ప్రధానోపాధ్యాయులు సర్వే ఫారం ను పూర్తిచేసి సబ్మిట్ చేయాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో మరియు కళాశాలల్లో 9వ,10 తరగతి మరియు ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు అపార్ సంఖ్యను నమోదు చేయాలని ఇది చాలా ముఖ్యమైన పని అని భవిష్యత్తులో అందరూ విద్యార్థులకు అమలు చేసే అవకాశం ఉంది కాబట్టి అందరు ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆధార్ లో తప్పుగా నమోదు అయిన పేర్లను, డేట్ ఆఫ్ బర్త్ తదితర వివరములను సరిచేసుకోవాల్సిందిగా సూచించగలరు అని అన్నారు. విద్యార్థులకు వీరగాధ 4.0 కి సంబంధించి ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించి బెస్ట్ పార్టిసిపెంట్స్ వివరములను వారిని వీరగాధ పోర్టల్లో అప్లోడ్ చేయవలసిందిగా తెలియజేశారు. యుడైస్ ప్లస్ లో విద్యార్థులందరి వివరాలు ప్రధానోపాధ్యాయులు ఒకసారి వెరిఫై చేయవలెనని సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులకు ఎటువంటి పథకాలు మరియు కార్యక్రమాలు అమలు చేయాలన్నా యుడైస్ లో వివరములను ప్రాతిపదికగా తీసుకుంటారని, కాబట్టి ప్రధానోపాధ్యాయులు విద్యార్థి యొక్క జనరల్ ప్రొఫైల్, ఎన్రోల్మెంట్ ప్రొఫైల్ మరియు ఫెసిలిటీ ప్రొఫైల్ ఈ మూడింటిలో అన్ని వివరాలు అనేవి ఒకటికి రెండుసార్లు పరిశీలించి వెరిఫై చేసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులకు భవిష్యత్తులో టీచ్- టూల్ ట్రైనింగ్, ఎస్ఎఎల్టి ట్రైయింగ్, ఎఫ్.ఎల్ .ఎన్ ట్రైనింగ్ రెసిడెన్షియల్ లేదా ఆన్లైన్ తరహాలో జరగనున్నాయని కాబట్టి ప్రధానోపాధ్యాయులు వాటన్నిటికీ పూర్తి సన్నిద్ధంగా ఉండవలెనని సూచించారు. అదే విధంగా ఉపాధ్యాయులకు టీ.పీ.డీ. నిమిత్తం ఫిర్కి కోర్సు, దివ్యాంగుల విద్యార్థుల స్క్రీనింగ్ కి సంబంధించి ప్రశస్త్ యాప్ ను విద్యార్థుల మార్కులు నమోదును, నవంబర్ 14న నిర్వహించే ఉపాధ్యాయులు దినోత్సవం, విద్యార్థుల దినోత్సవం, తదితర విషయాలపై ప్రధానోపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కవుతరం హై స్కూల్ హెచ్. యం బి.వి.ఎన్.ఎల్. పద్మావతి, ప్రధానోపాధ్యాయులు, సిఆర్పి లు, ఐఈఆర్పి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులారా ఓటరుగా నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : పట్టభద్రులారా ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ కార్పొరేటర్, చేయూత అధ్యక్షులు పిల్లి లక్ష్మీతులసి పట్టభద్రులకు పిలుపునిచ్చారు. మధురానగర్లోని వి.వి.నరసరాజు రోడ్లో ఓంకార క్షేత్రం శ్రీ షిర్డిసాయిబాబా మందిరం ప్రక్కన 'చేయూత కార్యాలయానికి విచ్చేసి పట్టభద్రులందరు ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. త్వరలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని, ఈ ఎన్నికల్లో డిగ్రీ పూర్తిచేసిన వారే ఓటు వేయాలని, గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు అయిన వారు సైతం తిరిగి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పాత ఓటర్ల జాబితా రద్దు అవుతుందన్నారు.ఈ ఎన్నికల్లో ఓటు వెయాలంటే 2021 నవంబర్ 1వ తేదీ లోపు డిగ్రీ గాని డిప్లమో పూర్తిచేసిన డిగ్రీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, ఓటరు కార్డు జిరాక్స్ కాపీలు రెండు పాస్పోర్ట్ ఫొటోలతో మా కార్యాలయానికి వస్తే పట్టభద్రులుగా ఓటరుగా నమోదు చేస్తామన్నారు.నవంబర్ 6వ తేదీ లోపు ఆఖరు తేది.ప్రతిరోజు ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు కార్యాలయం తెరచి ఉంటుందన్నారు.

'పల్లె పండుగ వారోత్సవాలు'

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని ఈదుల మద్దాల, అప్పికట్ల, గురువిందగుంట, మహేశ్వరపురం గ్రామాలలో పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు శనివారం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ ఏఈ సహనాజ్, పంచాయతీరాజ్ ఏఈ రామ్మోహన్ రావు, పంచాయతీ కార్యదర్శులు అకల్య, విజయ్, శ్రీనివాస్, ఈదుల మద్దాల గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు కనుమూరి ఈశ్వరరావు ఆధ్వర్యంలో భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంగర హిమబిందుచంద్రం, టిడిపి గ్రామ అధ్యక్షుడు రాజులపాటి ధర్మేంద్ర, దిట్టకవి జగన్నాథం, కలపాల కిషోర్, శాయల నాగమల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శారదాపీఠం స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విశాఖపట్నంలోని భీమిలి దగ్గర శారదాపీఠానికి ఇచ్చిన స్థలాన్ని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి అని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు.జగన్ ప్రభుత్వం శారదా పీఠాధిపతి స్వరూపానందకు 2021లో భీమిలి మండలం కొత్తవలస వద్ద రూ.250 కోట్లవిలువైన భూమిని ఈ దొంగ స్వామికి దారాదత్తం చేయటాన్ని తక్షణమే ఆపాలన్నారు. స్థలం ఇవ్వటానికి ఇచ్చిన జివో 48ను తక్షణం రద్దుపరచాలి అన్నారు. భీమిలికి సమీపంలోని సర్వేనంబరు 102/2 లో 7 .50 ఎకరాలు, సర్వేనంబరు 103 లో 7 .50 ఎకరాలు మొత్తం 15 ఎకరాలు భూమిని , ఎకరం లక్ష చొప్పున 15 ఎకరాలు 15 లక్షలకు భూమిని చదును చేసి అక్కడవరకు ప్రభుత్వ ఖర్చుతో రోడ్డువేసి,తన రాజగురువు అయిన స్వరూపానందకు రూ.250 కోట్ల భూమిని అధ్యాత్మిక కేంద్రం పేరుతో జగన్ అప్పగించారన్నారు.అయితే ఆ భూమిని అధ్యాత్మిక కేంద్రానికి బదులు వాణిజ్యకేంద్రంగా మార్చుకొని, రియల్ ఎస్టేటుగా మార్చుకునేందుకు అప్పటి ప్రభుత్వానికి స్వరూపానంద లేఖ వ్రాశారన్నారు.అధికారంలోకి మరలా జగన్ వచ్చిఉంటే ఈపాటికి ఆయన కొరిక తీరిఉండేదన్నారు.2014 లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన ముహూర్తం మంచిదికాదు, విజయవాడలో రోడ్డు వెడల్పుచేసే సందర్భంలో కొన్ని గుడులు పడగొట్టాడు ,అందుకె 2019లో ఓడిపోయాడు అని తన అక్కసును వెళ్లగక్కాడన్నారు.ఆయన ఒక సన్యాసి కదా అటువంటి వ్యక్తికి కొట్లాది రూపాయల భూములు,వేలకోట్ల డబ్బు ఎందుకు అని ప్రశ్నించారు.అలాగే నెల్లూరు జిల్లా గుడ్లురుమండలం చేవూరులో సర్వేనంబరు 879 లోని చెరువుపోరంబోకు, సర్వేనంబరు 883 లోని అటవీభూమిని రామదూత అనే దొంగస్వామి ఆక్రమించి ఆశ్రమం పేరుతోమోసం చేస్తున్నాడు, తిరుపతిజిల్లా వరదయ్యపాలెం మండలంలో కల్కి అనే దొంగస్వామి పేదలభూములు, బి యెన్ కండ్రిక మండలంలో కోట్లాదిరూపాయలువిలువచేసే 21 ఎకరాల అంజూర్ అటవీభూములు ఆక్రమించి ఆశ్రమాలపేరుతో మోసంచేస్తున్నారు.ఈ విధంగా రాష్ట్రంలో దొంగస్వాములు, దొంగమాతలు ప్రభుత్వ భూములుఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసంచేస్తున్నారు. ఆధ్యాత్మికంపేరుతో ఆశ్రమాలను నేరసామ్రాజ్యాలుగా మారుస్తున్న ఈ ఆశ్రమాల గుట్టురట్టు చేసి, అక్రమణభూములను స్వాధీనంచేసికొని భవిష్యత్తులో ఎవరు భూములు అక్రమించకుండా వాళ్ళను అరెస్టుచేయాలని తాము డిమాండ్ చేస్తూన్నామన్నారు.ఈ సమావేశంలో హేతువాద సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.లక్ష్మినారాయణ, ఆర్.శ్రీను, శిరీష్బాబు,పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు నున్న హైస్కూల్ విద్యార్థులు

- ఈ నెల 23 నుంచి 27 వరకు మీరట్లో అండర్ - 19 పోటీలు
- నవంబరు 16 నుంచి 19 వరకు గోరఖ్పూర్లో అండర్ - 14 టోర్నమెంట్

విశాలాంధ్ర -విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నున్న జడ్పీ హైస్కూల్ ఆవరణలోనే జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు ప్రాతినిధ్యం వహించి జిల్లాకు ఎనిమిది బంగారు పతకాలను అందించారు. దీంతో జాతీయస్థాయి పోటీలలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించింది. ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్లోని మీరట్లో జరగనున్న అండర్ - 19 ఫ్రీస్టైల్ బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన బి గౌతమ్ కుమార్, బాలికల విభాగంలో కె దివ్య జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. అలాగే నవంబరు 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్లోని గోరఖ్పూర్లో జరగనున్న అండర్ -14 ఎస్జీఎఫ్ఐ రెజ్లింగ్ పోటీలలో పాఠశాలకు చెందిన డి సంతోష్, డి అమర్కుమార్ రాష్ట్ర బాలుర జట్టుకు,ఎం పవిత్ర బెహర, టి స్నేహలత, పి దీపిక, టి చిట్టెమ్మ రాష్ట్ర బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు మొత్తం 11 బంగారు పతకాలు లభించగా, అందులో ఎనిమిది నున్న హైస్కూల్ విద్యార్థులు సాధించినవే కావడం విశేషం. ఈ సందర్భంగా జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్ రెడ్డి, ఫస్ట్ అసిస్టెంట్ సూరపనేని రవి ప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ పట్నాల నాగేశ్వరరావు అభినందించారు. అలాగే విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు టి శ్రీలత, టి విజయ వర్మ, రెజ్లింగ్ కోచ్ భార్గవ్ను కూడా అభినందించారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



విశాలాంధ్ర-వియవాడ: గత ప్రభుత్వ హయంలో విలీనం కాబడి తీవ్రంగా నష్టపోయిన తమకు తగిన న్యాయం చేయాలని కోరుతూ ఎయిడెడ్ ఉపాధ్యాయులు శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావుని శనివారం కలిసి వినతి పత్రం అందజేసి సమస్యలు వివరించారు. విలీన ఎయిడెడ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎం మోహనవెంకట కృష్ణ ప్రధాన కార్యదర్శి ఎంవీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ 70 నుండి 100 కిలోమీటర్ల సుదూర ప్రాంతాలకు బదిలీ అయిన మమల్ని రాబోయే బదిలీ ప్రక్రియలో దగ్గర ప్రాంతాలకు మార్చాలని విలీనం వల్ల జీరో సర్వీస్ గుర్తింపు కాకుండా ఎయిడెడ్ కాలం నాటి నుండి కలుపుతూ వంద శాతం సర్వీసు ఇవ్వాలని కోరారు. ఆనాటి జీఓ 50 ప్రకారం ప్రత్యేకమైన సర్వీస్ రూల్స్ అందిస్తామని ప్రకటించినప్పటికీ అమలు కాలేదని తెలిపారు. లక్ష్మణ రావు మాట్లాడుతూ శాసనమండలి లోనూ, విద్యా శాఖ అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారానికి తోడ్పడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు ఏ. సీతారాం మూర్తి, హరిప్రసాద్, ఏ సురేష్ కుమార్, జే సత్యానందం,సీతమ్మ, ఆస్కార్, థామస్, ఎం భాను ప్రకాష్ ఉన్నారు.